ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శుక్రవారం 1 ఆగస్టు 2025



బిల్లులు ఇప్పించరూ

- నాలుగేళ్ల క్రితం పాఠశాల అభివృద్ధి పనులు
- కలెక్టర్‌ను వేడుకుంటున్న కాంట్రాక్టర్లు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంట్రాక్టర్లు

ముత్తారం, జూలై 31(ఆంధ్రజ్యోతి): అడవిశ్రీరాంపూర్ ప్రభుత్వ పాఠశాలలో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు ఇప్పించాలని మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో కాంట్రాక్టర్లు కలెక్టర్‌ను వేడుకుంటున్నారు. గురువారం విలేకరుల సమావేశంలో కాంట్రాక్టర్లు తాత చేరాలు, పింగలి దేవేందర్ రెడ్డిలు మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం పాఠశాలలో మరుగుదొడ్లు ప్రహరీ నిర్మించామన్నారు. రూ.3లక్షలు అగ్రిమెంట్ అయినప్పుడు ఉన్న ఏఈ బదిలీ అయ్యారు. అనంతరం రూ.50 వేల పని చేయాలని, అమ్మ ఆదర్శ పాఠశాల కింద వచ్చే నిధుల్లో బిల్లు పెడతామని ఏఈ పేర్కొన్నారన్నారు. దీంతో తాము పనులు చేశామని, బిల్లులు ఇప్పటివరకు పాఠశాల విద్యకమిటీ ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లుల కోసం పంచాయతీరాజ్ ఏఈలను అడగగా విద్యాకమిటీ నిధుల నుంచి బిల్లులు ఇప్పిస్తానని తెలిపారని, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓదెలును అడగగా బిల్లు ఇంకా రాలేదని దాటవేశారన్నారు. పాఠశాల అభివృద్ధికి పనులు చేసి ఆర్థికంగా నష్టపోయామన్నారు. బిల్లు ఇవ్వకుండా ప్రధానోపాధ్యాయుడు, విద్యాకమిటీ చైర్మన్ ఇబ్బంది పెడుతున్నారని వారు ఆరోపించారు. ఈ విషయంపై కలెక్టర్ చొరవ చూపాలని కాంట్రాక్టర్లు కోరారు.



స్కూల్ బస్సు డ్రైవర్లకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు

8



గోదావరిఖనిలోని రాజీవ్ రహదారి

సర్వీస్ రోడ్లకు మోక్షం

- రాజీవ్ రహదారి నిర్మాణమైన పదేళ్లకు పనులు
- పదేళ్లలో పలువురు మృత్యువాత
- రామగుండం బీ పవర్‌హౌస్ నుంచి గోదావరి బ్రిడ్జి వరకు ...

కోల్‌సిటీ, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారి నిర్మాణం పూర్తయి పదేళ్లుగా టోల్ వసూలు చేస్తున్నా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సర్వీస్ రోడ్ల నిర్మాణం జరుగలేదు. దీంతో స్థానికులు రాజీవ్ రహదారిపై ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారు. పదేళ్ల కాలంలో 70మందికిపైగా బలయ్యారు. సర్వీస్ రోడ్డు నిర్మాణానికి భూ సేకరణ ఆవశ్యకత లేకున్నా చిన్న చిన్న కారణాలతో రోడ్డు నిర్మాణానికి అడ్డు చెబుతూ వచ్చారు. రాజీవ్ రహదారి రోడ్డు నిర్మాణ సంస్థ ఇదే అదనుగా సర్వీస్ రోడ్లు వేయకుండా చేతులు దులుపుకుంది. దీంతో స్థానికులు ఏ అవసరం వచ్చినా రాజీవ్ రహదారిపైకి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాహనాల రద్దీతో తరచూ ప్రమాదా లకు గురయ్యేవారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ చొరవ తీసుకోవడంతో సర్వీస్ రోడ్ల నిర్మాణం ప్రారంభమైంది. రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న భవనాలు, కట్టడాలను యజమానులు స్వచ్ఛందంగా తొలగించుకుంటున్నారు.

పదేళ్లుగా పెండింగ్...

రాజీవ్ రహదారి నిర్మాణం 2014లో పూర్తయి జూన్ 2వ తేది నుంచి టోల్ వసూళ్లు ప్రారంభించారు. రాష్ట్ర రహదారి-1గా పిలువబడే రాజీవ్ రహదారి నిర్మాణ సమయంలో గ్రామాలు, పట్టణాల్లో ప్రజల సౌలభ్యానికి సర్వీస్ రోడ్లు నిర్మించాలనే నిబంధన ఉన్నది. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గోదావరిఖని గంగానగర్ నుంచి రామగుండం బీ పవర్ హౌస్ వరకు సర్వీస్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. కొన్ని చోట్ల రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్ల నిర్మాణం చేశారు. గోదావరిఖని గంగానగర్, బస్టాండ్ ఏరియా, కవిత థియేటర్ నుంచి బంగ్లాస్ ఏరియా వరకు, ఎన్‌టీపీసీ పాత హెలీప్యాడ్ నుంచి టీటీఎస్ గేట్ వరకు నాలుగు ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉంది. రహదారి నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో

ప్రమాదాల్లో 70మందికిపైగా మృత్యువాత..

రాజీవ్ రహదారికి సర్వీస్ రోడ్లు లేకపోవడంతో రామగుండం అర్బన్‌లో పదేళ్ల కాలంలో 70మందికి పైగా మృత్యువాత పడ్డారు. గోదావరిఖని గంగానగర్ వద్ద ట్రాలీ ప్రమాదంలో ఏడుగురు మృత్యువాత పడ్డారు. గోదావరిఖని బస్టాండ్, మేడిపల్లి చౌరస్తా, కవిత థియేటర్ డౌన్, గంగానగర్‌లలో జరి గిన ప్రమాదాల్లో రామగుండం పారిశ్రామిక ప్రాం తానికి చెందిన సింగరేణి, ఎన్‌టీపీసీ ఉద్యోగులు, ప్రభుత్వ టీచర్లు, యువకులు మరణించారు. ప్రమాదాల తీవ్రత పెరగడంతో సర్వీస్ రోడ్డు నిర్మించాలనే డిమాండ్ ఏర్పడింది. ఇది ఎన్నికల నినాదంగా మారింది.

నిర్మాణం జరిగిన ప్రాంతాలు కూడా ఉపయోగం లేకుండా పోయాయి. ఎల్లంపల్లి ప్రాజక్టు నుంచి రామగుండం మంచినీటి సరఫరా లైన్లను ఈ రహదారి తవ్వే నిర్మించారు. దీంతో ఏ అవసరానికి కూడా వాడని పరిస్థితి ఏర్పడింది.

ఎట్టకేలకు నిర్మాణ పనులు ప్రారంభం...

రాజీవ్ రహదారికి రామగుండంలో సర్వీస్ రోడ్లు నిర్మించాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఎన్నికైనప్పటి నుంచి ప్రయత్నాలు మిగతా 8వ పేజీలో



రాజీవ్ రహదారి సర్వీస్ రోడ్డు నిర్మాణం

అక్టోబర్ వరకు సోలార్ ప్లాంట్ల నిర్మాణం పూర్తి చేయాలి

గోదావరిఖని, జూలై 31(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 122మెగావాట్ల సోలార్ ప్లాంట్ల పనులను అక్టోబర్ వరకు పూర్తి చేయాలని సీఎండీ బలరాంనాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం సింగరేణి భవన్‌లో సోలార్ పవర్, ఇతర వ్యాపార విస్తరణ చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 122మెగావాట్ల సోలార్‌ప్లాంట్ల నిర్మాణానికి టెండర్లు ఖరారు అయినప్పటికీ మరో 137మెగావాట్ల సోలార్ ప్లాంట్ల నిర్మాణం వెంటనే ప్రారంభించి ఏడాదిలోగా పూర్తి చేయాలని సూచించారు. రామగుండంలో చేపట్టనున్న గ్రీన్ హైడ్రజన్ ప్లాంట్ ఏర్పాటుకు అన్ని రకాల చర్యలు వేగంగా పూర్తి చేయాలని బలరాం సూచించారు. ఈ ప్లాంట్ పూర్తయితే రోజుకు 5టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి అవుతుందన్నారు. మణుగూరులో పెద్ద ఎత్తున జియో థర్మల్ విద్యుత్‌కు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఓఎన్‌జీతో కలిసి మణుగూరులో ప్లాంట్ ఏర్పాటుకు చర్చలు నడుస్తున్నాయని, ఉమ్మడిగా ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు ప్రా రంభించాలని సీఎండీ అధికారులకు సూచించారు. ఓపెన్‌కాస్టు డంపులపై పవన విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు అధ్యయనం పూర్తి చేయాలన్నారు. అలాగే రామగుండం మేడిపల్లి ఓపెన్‌కాస్టుగనితో పాటు ఇతర ఓపెన్‌కాస్టు గనుల్లో పంప్‌డ్ స్టోరేజ్ పవర్‌ప్లాంట్ నిర్మాణానికి నివేదికలు సమర్పించాలన్నారు. సంస్థ డైరెక్టర్లు డీ సత్యనారాయణ, ఎల్‌వీ సూర్యనారాయణ, కే వెంకటేశ్వర్లు, గౌతం పొట్రు, ఎస్‌డీఎం సుభాని, జీఎం మనోహర్, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం ఈడీ చిరంజీవులు, పవర్ ప్రాజెక్టు అధికారులు విశ్వనాథ రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ బలరాంనాయక్

విద్యార్థులకు వినికిడి యంత్రాల అందజేత



విద్యార్థినికి వినికిడి యంత్రాలు అందిస్తున్న డీఎంహెచ్‌వో

పెద్దపల్లి కల్చరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాథమిక పాఠశాలల్లో చదువుకుంటున్న పది మంది వినికిడి లోపంగల విద్యార్థులకు గురువారం జిల్లా వైద్యాధికారి అన్నప్రసన్న కుమారి చేతుల మీదుగా వినికిడి పరికరాలను అందజేశారు. కలెక్టరేట్‌లో రాష్ట్రీయ బాల స్వాస్థ్య ద్వారా గుర్తించిన విద్యార్థులకు జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని అలీమ్ కో ట్రస్టు వారు పరీక్షలు నిర్వహించి పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అంగన్‌వాడీ, పాఠశాలలకు వచ్చే సమయాల్లో ముందుగా తేదీలను నిర్ణయించాలని తెలిపారు. అలాగే విద్యార్థుల్లో వచ్చే సీజనల్ వ్యాధులు, జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలన్నారు. సాయంత్రం వరకు వారితో ఉండి హాజరును నమోదు చేయాలన్నారు. పాఠశాలల్లో వంటగదిని, పరిశుభ్రత పాటించాలని, పని చేసే సిబ్బందికి శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. వంట గది సమీపంలో మునగ, కరివేప చెట్లను పెంచాలని, వీటిని వంటలో విరివిగా వినియోగిస్తే విటమిన్ ఏ లోపం ఉండదని తెలిపారు. జిల్లా ఎర్లీ ఇంటర్వెన్షన్ సిబ్బంది కూడా సాయంత్రం వరకు ఉండి రిఫరల్ వచ్చిన కేసులకు ట్రీట్‌మెంట్ అందించాలని ఆదేశించారు. ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి కిరణ్ కుమార్, వైద్యాధికారులు, సిబ్బంది, స్వర్ణలత, ఫీల్డ్ రిలేషన్ ఆఫీసర్, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ పరీక్షల నిర్వహణ లక్ష్యాలను పూర్తి చేయాలి



బసంత్‌నగర్ పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పాలకుర్తి, జూలై 31(ఆంధ్రజ్యోతి): నవంబర్ నాటికి టీబీ పరీక్ష నిర్వహణ లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం పాలకుర్తి మండలం బసంత్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులు, ల్యాబ్‌లను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ టీబీ వ్యాధి సోకే అవకాశం ఉన్న వారిని గుర్తించి నవంబర్ లోపు స్క్రీనింగ్, వ్యాధి నిర్ధారణ పరీక్షలు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఎన్‌సిడి సర్వే ద్వారా గుర్తించిన మధుమోహం, బీపీ వ్యాధిగ్రస్తులు మందులు సరిగా వాడుతున్నారో లేదో ఫాలో అప్ చేయాలని అన్నారు. ల్యాబ్‌లో పరీక్ష ఫలితాలు సకాలంలో అందించాలని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రి వైద్యులు,నర్సులు,ఏఎన్‌ఎమ్‌లు,ఆశావర్కర్లు ఉన్నారు.

పలు పాఠశాలల్లో కలెక్టర్ తనిఖీలు



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శాంతినగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకస్మిక తనిఖీ చేశారు. వంట గదిని పరిశీలించారు. విద్యార్థుల తరగతి గదులను సందర్శించి పిల్లలకు కనీస విద్యా ప్రమాణాలు అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎదుగుదల రెగ్యులర్ మానిటరింగ్ చేయాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా చేయించే బోధనపరికరణాల వాడకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట వైద్యాధికా రులు సరళి, లక్ష్మీభవాని, అధికారులు పాల్గొన్నారు.

ఓపీ చిట్టీలు రాసేందుకు ప్రత్యేక గది నిర్మాణం

కళ్యాణ్‌నగర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో రోజురోజుకు ఓపీ సంఖ్య పెరుగుతోంది. పాత బిల్డింగ్‌లో ఉన్న ఓపీ చిట్టీలు రాసే వద్ద రోగులు క్యూ కడుతుండడంతో ఆసుపత్రి ముందున్న ఖాళీ స్థలంలో మరో మూడు ఓపీ విభాగాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. పాత బిల్డింగ్‌లో ఓపీ విభాగాల వద్ద క్యూలైన్లు పెరిగిపోవడంతో ఆసుపత్రి ఆవరణలో ఓపీని ఏర్పాటు చేయాలని ఆర్‌ఎంఓ రాజు కలెక్టర్‌కు విన్నవించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష ఓపీ విభాగాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించించడంతో పనులు వేగవంతంగా నడుస్తున్నాయి. రోగుల రద్దీ పెరగడంతో ఆసుపత్రికి వచ్చే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుండడంతో ఆసుపత్రి బయట ఓపీ చిట్టీల విభాగాన్ని ఏర్పాటు చేశారు.



పాలకవర్గం సరే.. కొనుగోళ్లు ఏవీ..

- అలంకారప్రాయంగా వ్యవసాయ మార్కెట్ కేంద్రం
- తొమ్మిదేళ్లుగా లేని మార్కెట్ యార్డు
- పాలకవర్గం ప్రమాణ స్వీకారాలకే సరి



వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

కమాన్‌పూర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): రైతుల దిగుబడులు కొనుగోలు చేసేందుకు, రైతులకు, వ్యాపారులకు వారధిగా ఉండి మార్కెట్ పాలక వర్గాలు పని చేస్తాయి. అయితే కమాన్‌పూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ మార్కెట్ కేంద్రం రైతులకు ఉపయోగ పడడం లేదు. ఇక్కడ కార్యాలయం మాత్రమే ఉండగా రైతుల పంట దిగుబడులు కొనేందుకు యార్డు లేదు. దీంతో రైతులు వారి దిగుబడులను ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. పాలకవర్గం ప్రమాణ స్వీకారం సమయంలో స్థలం సేకరిస్తామని హామీలు ఇవ్వడమే తప్ప ఆచరణకు నోచుకోవడం లేదు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 2016-17లో వ్యవసాయ మార్కెట్‌ను ఏర్పాటు చేసింది. తొమ్మిదేళ్లుగా పాలకవర్గం భర్తీ జరుగుతున్నా రైతులకు యార్డు నిర్మించడం లేదు. మార్కెట్ యార్డుకు స్థలం నిర్ణయించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నూతన పాలకవర్గం ఏర్పడిన తర్వాత ప్రమాణ స్వీకారాలు హంగు ఆర్భాటాలతో చేసి, యార్డు కోసం స్థల సేకరణ చేస్తామని హామీలే తప్ప కార్యాచరణ రూపుదాల్చడం లేదు.

యార్డు లేక రైతులకు ఇబ్బందులు...

మార్కెట్ యార్డు లేకపోవడంతో ఈ ప్రాంత రైతులు పండించిన పత్తి, మిర్చి, కందులు, మక్కలు విక్రయించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మంథని, పెద్దపల్లి, జమ్మికుంట, వరంగల్ మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారు. రవాణా చార్జీలు రైతులకు తలకు మించిన భారంగా మారుతున్నాయి. గిట్టుబాటు ధర వచ్చే వరకు యార్డులోనే రైతులు నిరీక్షణ చేయాల్సిన దుస్థితి ఉంటుంది.

స్థల సేకరణపై దృష్టి పెట్టాలి

నల్లవెల్లి శంకర్, కమాన్‌పూర్



పదవులకే పరిమితం కాకుండా రైతుల సౌకర్యార్థం కమాన్‌పూర్ మార్కెట్ యార్డు కోసం స్థల సేకరణపై దృష్టి సారించాలి. దిగుబడులను విక్రయించేందుకు రైతులు ఇతర మార్కెట్ యార్డులకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పాలకవర్గం స్పందించి త్వరితగతిన మార్కెట్ యార్డు ఏర్పాటుకు కృషి చేయాలి.

మార్కెట్ యార్డును ఏర్పాటు చేయాలి

సాన బాలయ్య, పత్తి రైతు, కమాన్‌పూర్



పంటలను పెద్దపల్లి, జమ్మికుంట మార్కెట్ యార్డులకు తీసుకెళు తున్నాం. దీంతో ట్రాలీ ఖర్చులు అధికంగా అవుతున్నాయి. గిట్టుబాటు ధర వచ్చే వరకు రోజుల తరబడి అక్కడే నిరీక్షించాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం, నాయకులు స్పందించి కమాన్‌పూర్ యార్డు కోసం స్థల సేకరణ చేసి రైతుల సమస్యను పరిష్కరించాలి.

విధులను సమర్థవంతంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ డీజీపీ

పెద్దపల్లి టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పోలీసులు విధులను సమర్థవంతంగా నిర్వహించాలని అడిషనల్ డీజీపీ అభిలాష్ బిస్త్ అన్నారు. పెద్దపల్లి డీసీపీ కార్యాలయంలో రామగుండం కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధిలోని డీసీపీ, ఏసీపీ, ఎస్‌హెచ్‌ఓ, మహిళా పోలీస్ అధికారులు, సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. పెద్దపల్లి డీసీపీ కార్యాలయానికి వచ్చిన అడిషనల్ డీజీపీని పోలీసు అధికారులు ఘన స్వాగతం పలికారు. పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ మర్యాదపూర్వకంగా మొక్కను అందచేసి స్వాగతం పలకగా, అనంతరం ఏఆర్ సాయిధ దళ సిబ్బంది గౌరవ వందనం చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహిస్తున్న డ్యూటీలు, పని ప్రదేశంలో సమస్యలపై తెలుసుకున్నారు. పిటిషన్ ఎంక్వయిరీ, పెట్రోలింగ్, నైట్‌డ్యూటీ, కోర్ట్ డ్యూటీ లు చేయడానికి మహిళా సిబ్బంది ధైర్యంగా ఉండాలన్నారు. డీసీపీ కరుణాకర్, గోదావరిఖని ఏసీపీ రమేష్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, సుల్తానాబాద్ సీఐ సుబ్బా రెడ్డి, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి, గోదావరిఖని 1 టౌన్ సీఐ ప్రసాద్ రావు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కార్మికశాఖ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా

గోదావరిఖని, జూలై 31(ఆంధ్రజ్యోతి): కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని గోదావరిఖని సహాయకార్మిక శాఖ అధికారి కార్యాలయం ఎదుట ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం సహాయ కార్మిక శాఖ అధికారికి వినతిపత్రం అందించారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు గుజ్జుల సత్యనారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు తోకల రమేష్, జిల్లా కార్యదర్శి రాజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక వర్గానికి మొండి చేయి చూపిస్తుందన్నారు. పలు రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు నాలుగైదు నెలలైనా జీతాలు చెల్లించడం లేదన్నారు. కార్మికులకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని, పని గంటలు పెంచే జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆడెపు శంకర్, పీ నాగభూషణం, దేవయ్య, గూడూరి వైకుంఠం, కల్వల రాజమల్లు, రాజు, ధర్మాజీ నరసయ్య, రాజన్న, నాని పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజా

కోల్‌సిటీటౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత-భద్రమైన పెట్టుబడి మార్గాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జైకిషన్ ఓజా మాట్లాడుతూ యువతలో ఆర్థిక ప్రణాళికపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, మ్యూచువల్ ఫండ్స్ సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండే పెట్టుబడి మార్గంగా ఉండటం వల్ల వాటి ప్రాధాన్యతను తెలిపారు. ముఖ్యవక్త ప్రైవేట్ మ్యూచువల్ ఫండ్‌కు చెందిన ఆర్థిక సలహాదారు ఏ.శ్రీనివాస్ మాట్లాడుతూ వివిధ రకాల పెట్టుబడి మార్గాలు మ్యూచువల్ ఫండ్‌లో సిస్టమెటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్, చక్రబద్ధ గురించి వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సాంబశివరావు, డాక్టర్ ఎం.నరేష్, డాక్టర్ అజయ్‌కుమార్, డాక్టర్ సుబ్బారావు, కామర్స్ విభాగాధిపతి ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితులను ఉరి తీయాలి

కళ్యాణ్‌నగర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం మంజునాథ ఆలయం ధర్మస్థలంలో వందలాది మంది యువతులు, మహిళలపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను ఉరి తీయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు మడికొండ ఓదమ్మ డిమాండ్ చేశారు. అత్యాచార ఘటనలను నిరసిస్తూ గురువారం రాత్రి గోదావరిఖనిలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఆమె మాట్లాడుతూ మంజునాథ దేవాలయం ధర్మస్థలంలో జరిగిన ఈ ఘటనపై వేగవంతంగా దర్యాప్తు చేయాలని, వారం రోజులుగా వెలుగులోకి వస్తున్న ఘటనలు భయానకరంగా ఉన్నాయని, ఆశ్రమాలు, ఆలయాల పేరుతో, ఆధ్యాత్మిక చింతన పేరుతో మహిళలను వంచిస్తున్నారని ఆరోపించారు. శనిగరపు తిరుమల, ఆసాల రమ, దుబాసి రేణుక, భాగ్య, సుజాత, రాజేశ్వరి, అంజలి, నీలిమ, ఓదమ్మ, భాగ్య, నస్రీన్, హసీన పాల్గొన్నారు.

మహిళపై..
ముగ్గురు యువకుల అత్యాచారయత్నం

కరీంనగర్ క్రైం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం బద్దిపల్లిలో ఒక మహిళాకూలీపై ముగ్గురు యువకులు అత్యాచారయత్నం చేసినట్లు బాధితురాలు గురువారం రాత్రి కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి సంబంధీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌కు చెందిన మహిళా కూలీ పిల్లలతో కలిసి కరీంనగర్‌లోని శివనగర్‌లో నివాసం ఉంటోంది. బుధవారం బద్దిపెల్లి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణపనికి మేస్త్రీతో కలిసి వెళ్లింది. ఇసుక ఆలస్యం కావటంతో బాధితురాలు అక్కడే సమీపంలో చెట్లకు కాకరకాయలు తెంపుకుని తిరిగివస్తోంది. ఈ క్రమంలో అక్కడే మద్యం సేవిస్తున్న ముగ్గురు యువకులు మహిళా కూలీపట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. ఆమె చేయిపట్టుకుని అత్యాచారయత్నం చేశారు. బాధితురాలు పెద్దగా అరవటంతో సమీపంలో ఉన్న మేస్త్రీ వెంటనే అక్కడికి వెళ్లి ఆమెను వారినుంచి రక్షించి, బైక్‌పై తీసుకుని వెళ్లే ప్రయత్నం చేశాడు. మళ్లీ ఆ యువకులు వారిని అడ్డగించి కిందపడేశారు. దీంతో మహిళాకూలీ కాలు విరిగింది. బుధవారం ఆసుపత్రికి వెళ్లి చికిత్సపొందిన ఆమె గురువారం కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే యువకులు, మహిళ మధ్య గొడవ జరిగినట్లుగా ప్రాథమికంగా తెలిసిందని, దీనిపై విచారణ జరుపుతున్నామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.

పెళ్లి కుదరడం లేదని యువకుడి బలవన్మరణం

శంకరపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్‌లో ఓ యువకుడు పెళ్లి సంబంధాలు కుదరడం లేదని మనస్తాపం చెంది గడ్డి మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొలంగూర్ గ్రామానికి చెందిన గూళ్ల శ్రీకాంత్(25)కు పెళ్లి సంబంధాలు చూస్తున్నప్పటికీ కుదరడం లేదు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై బుధవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడు శ్రీకాంత్ తండ్రి గూళ్ల శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుడికి జైలు శిక్ష

ధర్మపురి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని నేరెళ్ల శ్రీ సాంబశివుని ఆలయంలో హుండీ దొంగతనం చేసి సీసీ కెమెరాలు ధ్వంసం చేసిన కేసులో ఉబ్బిడి అలియాస్ విబ్బిడి శేఖర్ అనే నిందితునిని మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ ధర్మపురి కోర్టు జుడిసియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏగి జానకి గురువారం తీర్పునిచ్చారు. గత ఏడాది మార్చి 4న నిందితుడిని గుర్తించి ధర్మపురి ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచాడు, కోర్టు కానిస్టేబుల్ మహేష్ సాక్షులను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేష్ తమ వాదన వినిపించాడు. నేరం రుజువు కావడంతో నిందితునికి జైలు శిక్ష, జరిమాన విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు నిచ్చారు.

వృద్ధురాలి మెడలోని గొలుసు అపహరణ

ధర్మపురి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో గోదావరి నది పరిసరాల్లో గురువారం అయ్యోరి పోశవ్వ అనే వృద్ధురాలి మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తి బంగారు గొలుసు అపహరించాడు. మండలంలోని నేరెళ్ల గ్రామానికి చెందిన పోశవ్వ గోదావరి నది స్నానం కోసం ధర్మపురి వచ్చింది. ఆమెను వెంబడించిన గుర్తు తెలియని వ్యక్తి నీకు పెన్షన్ వస్తుందా అంటూ మాటలు కలిపి తాను సెక్రెటరీ అంటూ నమ్మ బలికాడు, అనంతరం పెన్షన్ ఇప్పిస్తానని మాయ మాటలు చెప్పి మెడలోని బంగారు చైన్ అపహరించాడు.

వ్యవసాయ మోటార్ చోరీ

జగిత్యాలరూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం తిప్పన్నపేట గ్రామ శివారులోని పొలం వద్ద బోగు లింగన్న అనే రైతుకు చెందిన విద్యుత్ మోటార్‌ను దొంగలు బుధవారం రాత్రి ఎత్తుకెళ్లారు. దీంతో పంటకు నీరు లేక ఎండిపోతున్నాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.



తల్లిపాలే అమృతం

- నవజాత శిశువులకు ముర్రుపాలు శ్రేష్ఠం
- నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

సిరిసిల్ల/సుభాష్‌నగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పసిపిల్లల నవ్వులు పెద్దల బాధలను దూరం చేస్తాయి. బోసి నవ్వులకు అనారోగ్యం చేస్తే ఆ తల్లి దండ్రులకు తల్లడిల్లిపోతారు. ఆరోగ్యవంతమైన పిల్లల ఎదుగుదలకు తల్లి పాలు మాత్రమే క్రియాశీల పాత్ర పోషిస్తాయి. తల్లీబిడ్డల మధ్య ఆత్మీయతను పెంచేవి తల్లిపాలు. తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యాన్ని, పోషక పదార్థాలను అందిస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా ఆగస్టు నెల మొదటి వారంలో తల్లిపాల విశిష్టతను ప్రచారం చేయడానికి అంతర్జాతీయ సంస్థలు ముందుకు వచ్చాయి. డబ్ల్యూఏబీఏ, డబ్ల్యూహెచ్‌వో, యూనిసెఫ్ సంస్థలతో పాటు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలను ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం 'తల్లి పాలకు ప్రాధాన్యతనివ్వండి.. స్థిరమైన మద్దతు వ్యవస్థలను సృష్టించండి" అనే థీమ్‌తో ప్రచారం చేయనున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పాలిచ్చే తల్లులు 3,064 మంది వరకు ఉండగా, గర్భిణులు 3,393 మంది ఉన్నారు. వీరికి 587 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టి కాహారాన్ని అందిస్తున్నారు. తల్లిపాల విశిష్టతనుచాటు తున్నారు. ఆరోగ్యలక్ష్మి పథకంలో 6 నెలల నుంచి మూడు సంవత్సరాల పిల్లలకు నెలకు 2.5 కిలోల బాలామృతం ప్యాకెట్, 16 గుడ్లు టేక్‌హోం రేషన్‌గా అందిస్తున్నారు. గర్భిణులు, బాలింతలతోపాటు మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు ఒకపూట సంపూర్ణ భోజనం, ప్రతి రోజు, గుడ్డు, పాలు, పప్పు, కూరగాయలతో భోజనాలు అందిస్తున్నారు.

పాలు ఎలా పట్టాలి...

తల్లి శిశువుకు పాలిచ్చే సమయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలి. శిశువు శరీరం, తల నిటారుగా ఉంచాలి. రొమ్ము వైపు శిశువును ముక్కుకు ఎదురుగా చనుమొన ఉండేలా తిప్పాలి. మెడ, భుజాలు మాత్రమే కాక శరీరం మొత్తాన్ని ఆధారంగా కల్పించాలి.

తల్లిపాలు అమృతం లాంటివి..

లక్ష్మీరాజం, రాజన్న సిరిసిల్ల జిల్లా సంక్షేమ అధికారి



అమ్మపాలు శిశువుకు అమృతంలాంటివి. ముర్రుపాలు శిశువుకు పట్టించాలి. జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పోషకాహారాన్ని అందిస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు వివిధ రకాల పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. తల్లిపాలపై విస్తృత ప్రచారాన్ని చేపట్టడానికి ఆగస్టు 1 నుంచి 7 వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నాం.

ముర్రుపాలు ఎంతో శ్రేష్ఠం..

ప్రస్తుత పరిస్థితుల్లో నవజాత శిశువుకు ఎంతో ఉపయోగకరంగా ఉండే ముర్రుపాలను అందించడం లేదు. ముర్రుపాలు శ్రేష్ఠత, ప్రత్యేకతను వివరించడం కోసం వారోత్సవాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. తల్లి గర్భంలోంచి బాహ్య ప్రపంచంలోకి వచ్చిన నవజాత శిశువుకు గర్భంలో ఉండే సదుపాయాలు కోల్పోతారు. అప్పుడే పుట్టిన బిడ్డకు రక్షణగా తల్లి నుంచి వచ్చే ముర్రు పాలు ఎంతో ఉపయోగ పడుతాయి. పసుపు వర్ణంలో నీళ్లలాగా ఉండి చిక్కగా తెలుపు, పసుపురంగులో జిగట స్వభావంతో వస్తాయి. చాలా మంది ముర్రుపాలు తాగితే వాతం చేస్తుందని, అవి జీర్ణం కావని శిశువుకు తాగించరు. శిశువుకు ముర్రుపాలు పట్టించాలని వైద్యులు చెబుతున్నారు. శిశువు జన్మించిన అరగంటకే పాలు పట్టిస్తే శ్వాసకోస, జీర్ణకోశ వ్యాధులు రాకుండా ఉంటాయి.

తల్లిపాలు శిశువుకు రక్షణ..

తల్లిపాలుశిశువుకు వ్యాధి నిరోధక శక్తి నిచ్చి రక్షణగా నిలుస్తాయి. తల్లిపాల వల్ల శిశువుకు పోషకాహార విలువలు కలిగిన ఆహారం ఎదుగుదలకు తోడ్పడుతుంది. ముర్రుపాలు వల్ల జీర్ణ వ్యవస్థ మెరుగుపడి మలవిసర్జన సాఫీగా ఉంటుంది. శ్వాస సంబంధ వ్యాధులు డయేరియా రాకుండా కాపాడుతుంది. యాంటీబయాటిక్స్ శిశువు ఎదుగుదలకు, జీర్ణ వ్యవస్థ సక్రమంగా పని చేసే విధంగా నిరోధక శక్తి పెరుగుతుంది. గొంతు, ఊపిరితిత్తులు, పేగులకు రక్షణ ఇస్తుంది. వైరస్, బాక్టీరియాల నుంచి రక్షణ కలుగుతుంది. ప్రొటీన్ ద్వారా శిశువుకు సులభంగా జీర్ణమై ఎక్కువగా ఆమ్లాలు కలగడం, మెదడు, కళ్ల అభివృద్ధికి తోడ్పడుతుంది. హార్మోన్లు, ఎంజైమ్‌లతో శిశువు పెరుగుదల ఉంటుంది. పోషకాహార లోపాన్ని అరికడుతుంది.

పాలు ఇవ్వడం వల్ల తల్లికి కలిగే ప్రయోజనాలు...

డాక్టర్ షాలిని. గైనకాలజిస్ట్, కరీంనగర్



తల్లిపాలతో శిశువులకే కాదు.. తల్లులకూ ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. తల్లి పాలు ఇవ్వడం వల్ల అదనపు కేలరీలు ఖర్చవుతాయి. గర్భధారణ సమయంలో పెరిగిన బరువు తగ్గడానికి సహాయపడుతుంది. తల్లిపాలు ఇవ్వడం వల్ల రొమ్ము, అండాశయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం తగ్గుతుంది.

దొంగల ముఠా అరెస్ట్

సిరిసిల్ల క్రైం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని గాంధినగర్‌లో ఆడెపు రవిందర్ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన దొంగల మూఠాను గురువారం అరెస్ట్ చేశామని టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. ఈ ఏడాది మార్చి 6న ఆడెపు రవిందర్ దుకాణంలో, ఆడెపు రేవంత్ ఇంట్లో దొంగతనం జరిగిందన్నారు. ఈ కేసులో సిరిసిల్ల పట్టణంలోని గాంధినగర్‌కు చెందిన గంధం కనకరాజు(26), రాందిన్ అమర్‌నాథ్(22)లను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించగా మరో ఇద్దరు మైనర్‌లను జూవనైల్ హోంకు తరలించామన్నారు. వీరివద్ద 21.1 గ్రాముల బంగారు నగలు, 35గ్రాముల రోల్డ్‌గోల్డ్ ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఒక బైక్, మూడు సెల్‌ఫోన్‌లు సీజ్ చేశామన్నారు. స్నేహితులైన నిందితులందరూ జల్సాలకు కోసం దొంగతనాలకు అలవాటు పడ్డార న్నారు. ఆడెపు రేవంత్ ఇంట్లో పనిచేసే తన తల్లితో పాటు బాలుడు వెళ్లి బంగారం, డబ్బులు ఉన్నాయని గుర్తించి తాళంచెవి తీసుకొని స్నేహితులైన నలుగురు కలిసి దొంగతనానికి ప్లాన్ వేశారన్నారు. ఇంటి యజమానులు ఇంట్లో లేని సమయంలో నలుగురు కలిసి వెళ్లి ముందుగా దుకాణం తాళం పగులగొట్టి నగదు దోచుకున్నారని, ఆ తర్వాత ఇంట్లోకి వెళ్లి తాళం తీసి లోనికి చొరబడి బంగారు ఆభరణాలు దొంగతనం చేసి ఎప్పటిలాగానే తాళం వేశారన్నారు.

దొంగిలించిన బంగారాన్ని నిందితులు మనప్పురం, ముత్తూట్ ఫైనాన్స్‌లో గోల్డ్‌లోన్స్ తీసుకున్నారన్నారు. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్‌సంస్థలు ఎలాంటి ముందస్తు విచారణ లేకుండానే బంగారు వస్తువులను కుదవ పెట్టుకొని డబ్బులు ఇవ్వడంపై తీవ్రంగా పరిగణిస్తూ అలాంటి సంస్థలపై చర్యలు తీసుకుంటామన్నారు. దొంగతనాల నివారణకు ప్రతి ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

తండాల్లో అబ్కారీశాఖ మెరుపు దాడులు

- పటిక, బెల్లం, సారా స్వాధీనం
- బెల్లం పానకం ధ్వంసం
- నలుగురి అరెస్ట్



కిష్టునాయక్ తండాలో పట్టుకున్న పటిక, బెల్లం, సారాతో ఎక్సైజ్ సిబ్బంది

ఎల్లారెడ్డిపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గరాజేశ్వర తండా, కిష్టునాయక్‌తండా, అల్మాస్‌పూర్ తండాల్లో అబ్కారీ అధికారులు గురువారం మెరుపు దాడులు నిర్వహించారు. సారా తయారీ కేంద్రాలను కనుగొన్నారు. నిల్వ చేసిన 300 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. 10 కిలోల పటిక, 20 కిలోల బెల్లం, 20 లీటర్ల సారా ప్యాకెట్లను స్వాధీనపర్చుకున్నారు. కేసునమోదు చేసి సారా తయారీదారులు ధరావత్ లక్ష్మీ, ధరావత్ బావ్‌సింగ్, బానోతు రామస్వామి, బానోతు సురేశ్‌లను అరెస్ట్ చేశామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. పల్లెలో సారాతయారు, రవాణా, అమ్మకాలు, ముడి సరుకుల విక్రయాలు సాగిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. దాడుల్లో టాస్క్‌ఫోర్సు ఎస్‌ఐ శైలజ, సిబ్బంది రాజు, రాకేశ్, సుమన్, హమీద్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సూపర్‌వైజర్, టీచర్ సస్పెన్షన్

- సీడీపీవోకు షోకాజ్ నోటీస్ జారీ చేసిన కలెక్టర్

చొప్పదండి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మండలం రుక్మాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వహించిన టీచర్, సూపర్‌వైజర్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి ఆదేశాలు జారీచేశారు. సీడీపీవోకు షోకాజ్‌నోటీస్‌ను కూడా జారీ చేశారు. గతబుధవారం మండలంలోని రుక్మాపూర్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికతనిఖీచేయగా పలు విషయాలు బయటపడ్డాయి. అంగన్‌వాడీ కేంద్రంలో ఆటవస్తువులగదికి, పిల్లల వాష్‌రూంకు తాళంవేసి ఉంచడం, పిల్లలహాజరు తక్కువగా నమోదవడంపై కలెక్టర్‌ఆగ్రహం వ్యక్తంచేశారు. విధులను నిర్ల క్ష్యం చేస్తున్న అంగన్‌వాడీటీచర్ వి స్వరూపను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. సెక్టార్‌పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ బాధ్యతలను నిర్లక్ష్యం వహించడం, పర్యవేక్షణ లోపం కారణంగా సూపర్‌వైజర్ కె శశికుమారిని సస్పెండ్ చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణలోపం కారణంగా గంగాధర ఐసీడీసీఎస్‌ప్రాజెక్టు సీడీపీవో నర్సింగరాణికి షోకాజ్‌నోటీస్ జారీచేశారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే, పర్యవేక్షణలోపిస్తే సంబంధిత టీచర్లు, పర్యవేక్షకులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు.

పర్లపల్లిలో ఎల్లమ్మ ఆలయంలో చోరీ

- బంగారం, వెండి, హుండీ ఎత్తుకెళ్లిన దొంగలు

తిమ్మాపూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్లపల్లి గ్రామంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో బుధవారం రాత్రి దొంగలు పడి బంగారం, వెండి, హుండీని ఎత్తుకెళ్లారు. ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పర్లపల్లి గ్రామశివారులో ఉండే రేణుక ఎల్లమ్మ ఆలయంలో బుధవారం గుర్తుతెలియనివ్యక్తులు ఆలయం తలుపులు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. ఆలయంలో ఉన్న15గ్రాముల బంగారు నగలు (తాళిబొట్టు, రింగులు, ముక్కుపుడక, బంగారుకళ్లు)తో పాటు 10గ్రాములవెండి, హుండీని ఎతుకెళ్లినట్లు తెలిపారు. గ్రామస్థులు హుండీలో 20తులాల వెండి నగలు పోయినట్లు తెలిపారు. గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

రాయికల్‌లో చోరీ

- తులంన్నర బంగారం, రూ.2 లక్షల నగదు అపహరణ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రాయికల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలో బుధవారం రాత్రి చోరీజరిగింది. పట్టణంలోని తెలంగాణ గ్రామీణబ్యాంక్ సమీపంలో నివాసం ఉండే మోర శంకర్ బుధవారం మధ్యాహ్నం 2గంటల సమయంలో తన ఇంటికి తాళంవేసి కుటుంబసభ్యులతో కలిసి మండలంలోని కిష్టంపేట గ్రామానికి ఓ శుభకార్యానికి వెళ్లారు. రాత్రి ఒంటిగంట సమయంలో తిరిగి ఇంటికి వచ్చిన శంకర్ తాళాలు పగులగొట్టి ఉండ టాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. ఇంటిలోని తులంన్నర బంగారునెక్లెస్, రూ.2లక్షల నగలను దొంగలు అపహరించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని చేరుకుని డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ సహాయంతో విచారణ ప్రారంభించారు. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. సంఘటనా స్థలాన్ని సీఐ సుధాకర్ పరిశీలించారు.

సీయూఈటీ ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థులు

తిమ్మాపూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మానకొండూర్ మైనారిటీ గురుకుల కళాశాలకు చెందిన ఇంటర్మీయట్ విద్యార్థులు సీయూఈటీ(కామన్ యూనివర్సిటీ ఎన్‌ట్రన్స్‌టెస్ట్)-2025 ఫలితాల్లో సత్తాచాటిదేశంలోని ప్రముఖయూనివర్సిటీల్లో సీట్లు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పిడిశెట్టి సంపత్ తెలిపారు. మైనారిటీ గురుకుల కళాశాలకు చెందిన రవితేజ, ఎండీ ఆఫ్రోజ్, జి అజయ్, ఎ అజయ్, రాంచరణ్ పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీలో, ఎం రాకేష్, ఎండీ సాజిద్ సిటీ కళాశాలలో, ఎండీ సమీర్‌పాషా, బి రిశ్వాన్, ఎం గౌతంసాయి నిజాం కాలేజీలో సీట్లు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ పిడిశెట్టి సంపత్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.



అజయ్ గౌతంసాయి సమీర్‌పాషా రామ్‌చరణ్ రవితేజ

రోడ్డుపై చెత్త వేసిన వ్యాపారులకు జరిమానా



వ్యాపారికి జరిమానా రశీదు అందజేస్తున్న కార్పొరేషన్ జవాన్లు

కోల్‌సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై చెత్త వేసేవారిపై రామగుండం నగరపాలకసంస్థ చర్యలు చేపట్టింది. గురువారం గోదావరిఖని ఫైవింక్లయిన్‌లో రోడ్డుపై చెత్తవేసిన ఆరుగురు వ్యాపారులకు ఒక్కొక్కరికి రూ.500చొప్పున జరిమానా విధించారు. చెత్తను మున్సిపల్ వాహనాలకు ఇవ్వకుండా రోడ్డుపై చెత్తవేయడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం పేర్కొన్నారు. చెత్తను బయట పడవేయకుండా మున్సిపల్‌వాహనాలకు అందించి సహకరించాలన్నారు. వందరోజుల కార్యాచరణలో భాగంగా గురువారం రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలను తొలగించారు. కొత్తగా నిర్మించిన ఇండ్లకు కొలతలు నమోదు చేశారు. రఘుపతిరావునగర్‌లో వాల్ పెయింట్స్ వేయించారు. టీపీఎస్ నవీన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్, శానిటరీ జవాన్లు సుగుణాకర్, యూసుఫ్, ఆడెపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోతుల భయంతో మెట్లపై నుంచి జారిపడిన మహిళ

- తీవ్ర గాయాలు

సైదాపూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని వెన్కేపల్లిలో కోతుల భయంతో ఓ మహిళ మెట్లపై నుంచి జారిపడడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రం తిరుపతి వెన్కేపల్లిలోని పెట్రోల్‌పంప్ సమీపంలోని ఓ ఇంటిలో తన కుటంబంతో అద్దెకు ఉంటున్నాడు. గురువారం ఉదయం తిరుపతి భార్య పద్మ స్లాబ్‌పైనుంచి మెట్లద్వారా కిందకు దిగుతుంటే ఒక్కసారిగా కోతుల గుంపు వచ్చింది. తప్పించుకునే క్రమంలో మెట్లపై నుంచి జారిపడింది. దీంతో పద్మకు తీవ్రగాయాలయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. మండలకేంద్రంతో పాటు గ్రామాల్లో కోతుల బెడద పెరిగిపోయిందని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

కోల్‌సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బస్టాండ్ వద్ద జూలై30న విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించి, దూషించిన ఘటనలో గోదావరిఖని పవర్‌హౌస్ కాలనీకి చెందిన అనుమాల మనోజ్ కుమార్‌పై గురువారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదుచేశారు. బస్టాండ్‌వద్ద విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారిని ఫొటోలు తీస్తున్నాడు. అటుగా నడుచుకుంటూ వెళుతున్న అనుమాల మనోజ్‌కుమార్ కానిస్టేబుల్‌ను అడ్డగించి దురుసుగా ప్రవర్తిస్తూ ఫొటోలు తీయవద్దని బెదిరించాడన్నారు. సదరు కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు వన్‌టౌన్ ఎస్‌ఐ భూమేష్ పేర్కొన్నారు.

దినసరి కూలీ వినూత్న ఆలోచన

- సొంతగా బ్యాటరీ సైకిల్ తయారీ



తాను తయారు చేసిన బ్యాటరీ సైకిల్‌తో హమీద్

జగిత్యాల అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం చల్‌గల్ గ్రామానికి చెందిన హమీద్‌అనే దినసరికూలీ వినూత్నంగా ఆలోచించి బ్యాటరీ సైకిల్ తయారు చేశాడు. జగిత్యాల పట్టణంలోని ఓ టైలర్‌షాపులో హమీద్ దినసరి కూలీగా పనిచేస్తుంటాడు.

రోజూ చల్‌గల్‌నుంచి జగిత్యాలకు వచ్చి వెళ్తుంటాడు. ద్విచక్ర వాహనం ఉపయోగిస్తే తనకు వచ్చే వేతనంలో పెట్రోల్‌కు ఖర్చు అవుతోందని సైకిల్‌పై వస్తున్నాడు. దీంతో ఆరోగ్య సమస్యలు ఎదురవడంతో తక్కువ ఖర్చుతో సైకిల్‌కు బ్యాటరీ అమర్చి తిరగవచ్చనే ఆలోచన వచ్చింది. తన దగ్గర ఉన్న సైకిల్‌కు మూడువేల రూపాయలు ఖర్చుచేసి మోటర్ కొనుగోలు చేశాడు.

ద్విచక్ర వాహనాలు రిపేర్ దుకాణంలో సెకండ్ హ్యాండ్ బ్యాటరీలు రెండు కొనుగోలు చేసి వాటికి మోటార్ కనెక్షన్ ఇచ్చాడు. మోటార్ నుంచి సైకిల్ వెనక టైర్‌కు కనెక్షన్ ఇచ్చాడు. దానినుంచి హ్యాండిల్ కుడివైపున ఆన్‌ఆఫ్ బటన్ ఏర్పాటు చేశాడు. దీనితో రోజూ ఉదయం హమీద్ ఇంటి నుంచి జగిత్యాలకు బ్యాటరీ సైకిల్‌పై ప్రయాణం చేస్తున్నాడు.

29 రైస్, సీడ్ మిల్లులకు షోకాజ్ నోటీసులు జారీ

హుజూరాబాద్/శంకరపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్, శంకరపట్నం మండలాల్లో వ్యవసాయ మార్కెట్ అనుమతి లేకుండా నడుస్తున్న 29రైస్, సీడ్‌మిల్లులకు మార్కెట్ పాలకవర్గ ఆదేశాలమేరకు షోకాజ్‌నోటీసులు జారీచేసినట్లు మార్కెట్ కార్యదర్శి అశోక్ గురువారం తెలిపారు. కొంతకాలంగా ఎలాంటి అనుమతులు లేకుండా సీఎంఆర్ ధాన్యం, వ్యవసాయ ఉత్పత్తులను సీడ్‌మిల్లు వ్యాపారులు మార్కెట్ లైసెన్స్ లేకుండా కొనుగోలు చేస్తున్నారన్నారు. మార్కెట్‌లైసెన్స్ ఉన్నవారుమాత్రమే వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలుచేయాలన్నారు. షోకాజ్‌నోటీసులకు స్పందించని యెడల వ్యాపారులపైచట్టరిత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

రాయికల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామంలో పెద్ద వాగు నదీ తీరాన గురువారం గంగమ్మ కమిటీ ఆధ్వర్యంలో గంగాదేవి, పరమశివుని విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరిగాయి. పండితులు కృష్ణ ప్రసాద్ శర్మ, సంతోష్‌లు ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు బెల్లపు అన్నం వండుకొని బోనం నెత్తిపై పెట్టుకుని జంబిగద్దె నుంచి పురవీధుల గుండా డప్పు చప్పుళ్ల మధ్య, భక్తి పాటలతో తరలివెళ్లి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. మాజీమంత్రి జీవన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంగమ్మతల్లి కమిటీ సభ్యులు, గ్రామసేవాసమితి కార్యవర్గ సభ్యులు, గంగపుత్రసంఘం సభ్యులు, దాతలు డాక్టర్ కాటిపెల్లి నారాయణ రెడ్డి, కొడిమ్యాల భూంరావు, సురభి భూంరావు, విగ్రహ దాతలు ఉట్నూరి రవి, మరిపెల్లి నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సుకు కాంగ్రెస్ న్యాయవాద బృందం



రైల్వే స్టేషన్‌లో కాంగ్రెస్ న్యాయవాద బృందం

కరీంనగర్ లీగల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా కాంగ్రెస్‌కమిటీ లీగల్‌సెల్‌చైర్మన్ అభిషేక్ మనుసింఘ్వీ ఆధ్వర్యంలో ఆగస్టు2న ఢిల్లీలో జరగనున్న జాతీయ సదస్సుకు కరీంనగర్‌జిల్లా కాంగ్రెస్‌లీగల్‌సెల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బయల్దేరివెళ్లారు. 'రాజ్యాంగ సవాళ్లు' అనే అంశంపై జాతీయసదస్సు జరగనుంది. జిల్లాచైర్మన్ కల్లె పెల్లి లక్ష్మయ్య, స్టేట్‌జాయింట్‌కన్వీనర్ భూక్యరజనీష్, జిల్లా వైస్‌చైర్మన్ బొడ్డు రాజు, జిల్లా కన్వీనర్లు కొత్తకొండ శంకర్, లింగంపల్లిశ్రీకాంత్, కో-కన్వీనర్ ఐతుసృజన్, మంచికట్లరాజేశం, పర్లపల్లివేణుగోపాల్, వేల్పులబాల కిషన్‌రావు, శివకుమార్, రాజశేఖర్, మల్లికార్జున్‌రెడ్డి, అభినవ్‌రెడ్డిలు బయల్దేరి వెళ్లారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

వీర్నపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం అడవిపదిర గ్రామంలోని తండాల్లో గుడుంబా స్థావరాలపై గురువారం తెల్లవారుజామున ఎస్‌ఐ వేముల లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. ఈ సందర్భంగా భూక్య సుజాత, భూక్యశివలాల్ ఇళ్లలో 2లీటర్ల నాటుసారా పట్టుకొని, 150లీటర్ల బెల్లం పానకాన్ని సారా తయారీకి వాడే ముడిపదార్థాలను ధ్వంసం చేశారు. నాటుసారా తయారుచేసిన, అమ్మినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గుడుంబాను తయారుచేస్తున్న సుజాత, శివలాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎల్ఎల్‌బీ ఆరు, నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జూన్ 2025లో నిర్వహించిన ఎల్ఎల్‌బీ ఆరు, నాలుగవ సెమిస్టర్ ఫలితాలను గురువారం శాతవాహన పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్ విడుదల చేశారు. ఈ పరీక్షల ఫలితాలు యూనివర్శిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.in లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.


● హోటల్ మేనేజ్‌మెంట్ పరీక్ష ఫలితాలు విడుదల

శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో మే 2025లో నిర్వహించిన హోటల్ మేనేజ్‌మెంట్ రెండవ, నాల్గవ, ఆరవ, సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్ గురువారం విడుదల చేశారు. ఈఫలితాలు యూనివర్సిటీ వెబ్సైట్ www.satavahana.ac.inలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

సన్నాహక సభను విజయవంతం చేయండి

హుజూరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ప్రతాపసాయి గార్డెన్‌లో ఈనెల7న పింఛన్ల పెంపుకై జరిగే మందకృష్ణమాదిగ సన్నాహక సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ ఎం రాజు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ వికలాంగుల ఆర్థిక భద్రతకు ఆసరా పింఛన్ల పెంపు అత్యంత అవసరమన్నారు. సమావేశంలోవసంత్, అశోక్,రాజు,రాజేష్,ఆదిత్య, తదితరులున్నారు.

పేద విద్యార్థులకు వరం
పీఎం విద్యాలక్ష్మి



● ఉన్నత చదవులకు బ్యాంకు రుణం ● వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగం

చొప్పదండి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పీఎం విద్యాలక్ష్మి పథకం పేద విద్యార్థులకు వరంగా మారనున్నది. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేని పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు ఈ పథకం భరోసానివ్వనున్నది. ఎలాంటి గ్యారంటీ లేకుండా తక్కువ వడ్డీకి రుణాలను బ్యాంకులు అందజేస్తాయి. వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం పీఎం విద్యాలక్ష్మి పథకాన్ని ప్రవేశ పెట్టింది. విద్యార్థులు రుణం కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా విద్యాలక్ష్మి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోపే బ్యాంకర్లు రుణాలను మంజూరు చేస్తారు. ఉన్నత చదువులకయ్యే ఖర్చులతోపాటు ట్యూషన్ ఫీజులు, హాస్టల్ వసతి, రవాణా ఖర్చులను కలిపి రుణం తీసుకునే అవకాశం ఈ పథకంలో ఉంది. ఈ రుణాలకు ఎలాంటి ప్రాసెసింగ్ చార్జీలు ఉండకపోగా తక్కు. వడ్డీకే రుణాలను విద్యార్థులకు అందజేస్తారు.



● ప్రయోజనాలు...

ఇంజనీరింగ్, మెడిసిన్, వృత్తి విద్యా కోర్సులు, డిగ్రీ కోర్సులతోపాటు ఉన్నత విద్యాభ్యాసం చేసే విద్యార్థులు విద్యాలక్ష్మి పథకం దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ కోర్సుల్లో చివరిసారిగా చదివిన కోర్సుకు సం బంధించిన మెమోలు, చదవాలనుకున్న కోర్సుకు సంబంధించిన అడ్మిషన్ పత్రాలు పోర్టల్ లో నమోదు చేయాల్సి ఉంటుంది. విద్యార్థి కుటుంబ వార్షిక ఆదాయం నాలుగు లక్షల లోపు ఉండాలి. దరఖాస్తు చేయడానికి ఏడాది ముందు చదివిన కోర్సుల్లో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ఒక విద్యార్థి ఒకేసారి మాత్రమే దరఖాస్తు చేసుకునే వీలుంటుంది. పీఎం విద్యాలక్ష్మి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల వివరాలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి రుణం మంజూరయిందా లేదా అన్నది తెలుసు కుంటారు. అవసరమైన ధ్రువపత్రాలను విద్యార్థులు జతచేయని పరిస్థితిలో దరఖాస్తును పెండింగ్‌లో ఉంచుతారు. దరఖాస్తుకు ఎలాంటి గడువు లేదు.

● దరఖాస్తు చేసుకోవడం ఇలా....

విద్యార్థులు www.vidyalakshmi.co.in వెబ్‌సైట్‌లో తమ పేరు, ఫోన్ నంబర్, ఈమెయిల్ ఐడీ, చిరునామా వివరాలను నమోదు చేసి రిజిస్టర్ చేసుకోవాలి. సీఈఎల్ఏఎఫ్ (సాధారణ విద్యా రుణ దరఖాస్తు పత్రాన్ని) పూర్తి చేసి సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాలి. అర్హులైన విద్యార్థులకు మూడు విభాగాల్లో రుణాలను మంజూరు చేస్తారు. విద్యార్థులు చదువుతున్న కోర్సునుబట్టి మొదటి విభాగంలో నాలుగు లక్షలు, రెండో విభాగంలో నాలుగు లక్షల నుంచి 7.50 లక్షలు, మూడో విభాగంలో 7.5 లక్షల కంటే ఎక్కువ రుణాన్ని 7 శాతం వడ్డీపై మంజూరు చేస్తారు.

నవోదయ విద్యార్థులు అన్నిరంగాల్లో రాణిస్తున్నారు

● జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



ట్రోఫీని అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

చొప్పదండి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం నవోదయ విద్యాలయంలో రీజనల్‌స్థాయి ఖోఖో పోటీల ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు విద్యాలయంలో ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓవరాల్ చాంపియన్‌గా బీఆర్ నవోదయ టీం నిలిచింది. అలాగే అండర్-14,17 బాలురజట్టు విజేతగా బీదర్ జట్టు, అండర్-14 బాలికలజట్టు విజేతగా కృష్ణనవోదయ, అండర్-17 బాలికల జట్టు విజేతగా బీదర్, అండర్-19బాలికల జట్టు విజేతగా ఖమ్మం జట్టు నిలిచాయి. కార్యక్రమంలో నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ పి మంగ తాయారు, తహసీల్దార్ నవీన్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, ఎంఈవో మోహన్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి తగ్గిన వరద

జగిత్యాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి గురువారం వరద తగ్గింది. డ్యామ్‌లోకి 5,990 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీల కుగాను ప్రస్తుతం 38.605 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 774 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 28.973 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 3.351 టీఎంసీల నీరును వ్యయం చేశారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు డ్యామ్

సినారె పురస్కారానికి జగిత్యాల అధ్యాపకుడు ప్రమోద్ ఎంపిక

జగిత్యాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలోని ప్రభుత్వ మహిళాడిగ్రీ కళాశాల తెలుగువిభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ తత్వాది ప్రమోద్ కుమార్ మహాకవి డాక్టర్ సి నారాయణరెడ్డి(సినారె) సాహితీ పురస్కారానికి ఎంపికైనట్లు హైదరాబాద్ మహాకవి సినారె కళాపీఠం నిర్వాహకులు ప్రకటించారు. ఆగస్టు 3వతేదీన హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందిస్తామని సంస్థ నిర్వాహకులు పోరెడ్డి రంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కథలాపూర్ మండలం తక్కల్లపల్లి గ్రామంలో జన్మించిన ప్రమోద్ కుమార్ అధ్యాపక వృత్తిలో రాణిస్తూనే తెలుగు సాహిత్యంలో రచనలు చేస్తున్నారు. డాక్టర్ ప్రమోద కుమార్ అనువదించిన కన్నడ కథలు చతుర, విపుల, ఆంధ్రజ్యోతి, స్రవంతి మొదలైన పత్రికలలో ప్రచురితమయ్యాయి. పురస్కారానికి ఎంపికైన ప్రమోద్ కుమార్‌ను మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కలువకుంట రామకృష్ణ అభినందించారు.



ప్రమోద్ కుమార్

బాలసదన్, శిశుగృహ సందర్శన

కరీంనగర్ అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలకు అనుగుణంగా, జిల్లా న్యాయ సేవాధి కార సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి కే వెంకటేష్ గురువారం కరీంనగర్‌లోని బాల సదన్, శిశుగృహాలను సందర్శించారు. చిన్నారులతో ముచ్చటిస్తూ కష్టపడి చదువుకుని ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. బాలసదన్, శిశు గృహాలలోని వంటశాల, ఆహారపదార్థాలను నిలువచేసే గదులను తనిఖీ చేశారు. పిల్లలు క్రమశిక్షణ అలవర్చుకోవాలని, పిల్లల ఆరోగ్య సమస్యలపై శ్రద్ధ వహించాలని కోరారు. అధికారుల గైర్హాజర్‌పై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పిల్లలకి పండ్లు పంపిణీ చేశారు. ఎలాంటి న్యాయపరమైన లేదా న్యాయసేవ అవసరమైనా సంప్రదించాలని సిబ్బంది, అధికారులను ఆదేశించారు.



పిల్లలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి కే వెంకటేష్

ఉమ్మడి జిల్లా ట్రావెలర్స్ అండ్ మినీ బస్సు అసోసియేషన్ ఏర్పాటు



ఉమ్మడి కరీంనగర్ జిల్లా ట్రావెలర్స్ అండ్ మినీ బస్సు అసోసియేషన్ సభ్యులు

కరీంనగర్ అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా ట్రావెలర్స్ అండ్ మినీబస్సు అసోసియేషన్‌ను గురువారం ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా బీవీ సుబ్బారెడ్డి, ప్రధానకార్యదర్శిగా హర్ష చక్రవర్తి, ఉపాధ్యక్షులు వెంకతేత్తి శ్రీధర్, పడాల పర్శరాములు, రేవురి నవీన్ శర్మ, వీరబత్తిని పురుషోత్తం, బండ సతీష్‌యాదవ్, కోశాధికారిగా జక్కుల పర్శరాములు, ఉపకోశాధికారిగా దేవరాజేందర్‌రెడ్డి, కార్యవర్గసభ్యులుగా రాంనగర్ వెంకన్న, అనిల్‌గౌడ్, మనోహర్, బక్కసత్తిని శ్రీనివాస్‌లతో నూతనకార్యవర్గాన్ని ఏర్పాటుచేశారు. అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బీవీ సుబ్బారెడ్డి, హర్ష చక్రవర్తి మాట్లాడుతూ అసోసియేషన్ ఉన్నతి కోసం, వాహనాల యజమానుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.


గొర్రెల కాపరుల సంఘాలు స్వయం ప్రతిపత్తిని సాధించాలి

● రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య ఎండీ డాక్టర్ సుబ్బారాయుడు

కరీంనగర్ అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గొర్రెల కాపరుల సంఘాలు స్వయం ప్రతిపత్తి సాధించాలని తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య ఎండీ డాక్టర్ సుబ్బారాయుడు అన్నారు. గురువారం నగరంలోని ఇందిరాగార్డెన్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ ఈడీ డాక్టర్ ఎన్ లింగారెడ్డి ఆధ్వర్యంలో యూనియన్ 18వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎండీ సుబ్బారాయుడు మాట్లాడుతూ సంఘాలు స్వయంసమృద్ధిని సాధించి బలోపేతం కావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ సుధాకర్, సిరిసిల్లజిల్లా అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి, పెద్దపల్లి జిల్లా అధికారి డాక్టర్‌శంకర్, ఉపసంచాలకులు డాక్టర్ రవికుమార్, అసిస్టెంట్ డైరెక్టర్లు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ బాలకిషన్, డాక్టర్ వాణిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఊపిరితిత్తులు జర భద్రం

నేడు వరల్డ్ లంగ్స్ కేన్సర్ డే



జగిత్యాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అప్రమత్తంగా వ్యవహరిస్తే లంగ్ కేన్సర్‌ను దూరం చేసే అవకాశాలు ఉంటాయని వైద్యులు సూచి స్తున్నారు. ఊపిరితిత్తుల కేన్సర్‌కు ప్రధాన కారణం ధూమపానం అని నిపుణులు పేర్కొంటున్నారు. కొన్ని జన్యుపరమైన కార ణాలు, గాలి కాలుష్యం, పరోక్షంగా ధూమ పాన ప్రభావానికి లోను కావడం, డీజిల్ ఎగ్జాస్ట్ పొగ తదితర కారణాల వల్ల ఈ వ్యాధి సోకుతుందంటున్నారు. దీర్ఘకాలికంగా స్టెరాయిడ్స్ వాడే వారిలో ఊపిరితిత్తుల కేన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుం దని వైద్యులు అంటున్నారు. లంగ్ కేన్సర్‌పై అవగాహన పెంపొందించుకోవడానికి ప్రపంచ ఊపిరితిత్తుల కేన్సర్ దినోత్సవాన్ని ప్రతీయేటా ఆగస్టు 1వ తేదీన నిర్వహిస్తున్నారు. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 13 మంది లంగ్ కేన్సర్ బాధితులు ఉన్నట్లు వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు వెల్లడించాయి.

తొలిసారిగా 2012 సంవత్సరంలో...

ఊపిరితిత్తుల కేన్సర్ వ్యాప్తి, ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఫోరమ్ ఆఫ్ ఇంటర్నేషనల్ రెస్పిరేటరీ సొసైటీస్ (ఎఫ్ఐఆర్ఎస్), ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ ది స్టడీ ఆఫ్ లంగ్ కేన్సర్(ఐఏఎస్ఎల్‌సీ) సహకారంతో 2012 ఆగస్టు1న మొదటిసారిగా ప్రపంచ ఊపిరితిత్తుల కేన్సర్ దినోత్సవాన్ని పాటించారు. అప్పటి నుంచి ప్రతీ సంవత్సరం ఆగస్టు 1న నిర్వహిస్తున్నారు. కేన్సర్ వ్యాధిని ముందుగా గుర్తించడం, సమయానికి తగిన చికిత్స తీసుకోవడం చాలా అవసరం. కేన్సర్ ను ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్త లు, నివారణకు కొనసాగుతున్న పరిశోధన తదితర విషయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం
డాక్టర్ నీలారపు శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, జగిత్యాల



లంగ్ కేన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. వ్యాధి లక్షణాలు గమనించిన వెంటనే వైద్యులను సంప్రదించాలి. కొన్ని లక్షణాలు కనిపించినంత మాత్రాన కేన్సర్ సోకినట్లు కాదు. వైద్య నిపుణుల పర్యవేక్షణలో వ్యాధి నిర్ధారణ చేసుకోవాలి. లంగ్ కేన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స సులువవుతుంది.

కొండగట్టులో ముగిసిన శ్రావణ సప్తాహ ఉత్సవాలు

మల్యాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో వారంరోజులుగా జరుగుతున్న శ్రావణసప్తాహ ఉత్సవాలు గురువారంతో ముగిసాయి. చివరిరోజు స్వామివారికి ఆలయ అర్చకులు మన్య సూక్త సహిత అష్టోత్తర శతకళశాభిషేకం, సహస్ర నాగవల్లి దలార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపారు. సాయంత్రం పల్లకి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్‌రావు, ఆలయ స్థానాచార్యులు కపీందర్, ప్రధానర్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్, రఘు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.



కొండగట్టులో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

స్పీకర్ చెంతకు జగిత్యాల ఎమ్మెల్యే పార్టీ ఫిరాయింపు పంచాయితీ

● మూడునెలల్లో నిర్ణయం తీసుకోవాలని సూచించిన సుప్రీంకోర్టు



జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి (ఫైల్)

జగిత్యాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ పార్టీ ఫిరాయింపు పంచాయితీ అసెంబ్లీ స్పీకర్ చెంతకు చేరింది. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన పలువురు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌తోపాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు పరిశీలన జరిపి మూడు నెలల్లోగా అసెంబ్లీ స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సూచించింది. దీంతో స్పీకర్ తీసుకునే నిర్ణయంపై జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ భవితవ్యం ఆధారపడినట్లయింది. స్పీకర్ ఎటువంటి నిర్ణయం తీసుకుంటారు..ఎలాంటి రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటాయన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

● 2014లో తొలిసారి బరిలో..

బీఆర్ఎస్‌లోచేరి తొలిసారిగా 2014అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల నియోజకవర్గం నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా సంజయ్‌కుమార్ పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి 62,616ఓట్లు రాగా టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసిన డాక్టర్ సంజయ్ కుమార్‌కు 54,788ఓట్లు సాధించి ఓటమి పాలయ్యారు. 2018అసెంబ్లీ ఎన్నికల్లో రెండో పర్యాయం పోటీచేసి విజయం సాధించారు. ఈఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసిన డాక్టర్ సంజయ్ కుమార్‌కు 1,04,247 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డికి 43,062 ఓట్లు మాత్రమే వచ్చాయి. 2023 నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌కు 70,243 ఓట్లు రాగా తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డిపై 15,822 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. వరసగా రెండో పర్యాయం మాకునూరి సంజయ్ కుమార్ విజయం సాధించారు.

గత పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీఅభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ సీటును బీఆర్ఎస్ గెలుచుకోలేకపోయింది. అనంతరం 2024జూన్ 23వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ చేరిక పట్ల మాజీమంత్రి జీవన్‌రెడ్డితో పాటు ఆయన అనుచరులు అసంతృప్తిని పలు సందర్భాల్లో వ్యక్తం చేశారు.

రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ ఆదర్శనీయం

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

మెట్‌పల్లిటౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ దేశానికే ఆదర్శమని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం మెట్‌పల్లి పట్టణంలోని జువ్వాడి భవన్‌లో జువ్వాడి కృష్ణారావుతోకలిసి విలేకరులతో ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. 2014లో బీఆర్ఎస్ హయాంలో పేద ప్రజల నుంచి రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించిన దాఖలాలు లేవని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం జగిత్యాల జిల్లాలో 55 వేల మందికి కొత్తగా రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కోరుట్ల నియోజకవర్గంలో మొత్తం 20వేల రేషన్‌కార్డులు అందజేసినట్లు పేర్కొన్నారు. బీసీల గురించి పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు ఢిల్లీలో ధర్నా చేద్దామనడం హాస్యాస్పదం అన్నారు. రాష్ట్రంలో ప్రతి పేదవాడికి పక్కా ఇండ్లు ఉండాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరు చేశారన్నారు. ఎక్కడా యూరియా కొరత లేదని, ఎవరైనా రైతులను ఇబ్బందులకు గురి చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, పట్టణ, మండల అధ్యక్షులు జెట్టి లింగం, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు జెట్టి లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్ గౌడ్, సురేష్‌గౌడ్, సత్యనారయణ గౌడ్, నాయిని సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మెట్‌పల్లిలో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

మీ సేవలో మరిన్ని సేవలు



● కార్యాలయాల చుట్టూ తిరగనక్కరలేదు
● మ్యారేజ్ సర్టిఫికెట్ తీసుకునే అవకాశం

కరీంనగర్ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం మీసేవలో మరిని సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకు వచ్చింది. ప్రజలు వివిధ సర్టిఫికెట్‌ల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతుం డటంతో ఇబ్బందులు పడుతున్నారు. మీసేవ పరిధిలోకి ఎక్కువ పౌర సేవలను అందుబాటులోకి తీసుకువస్తే అటు అధికారులకు కూడా సమయం ఆదా అవు తుంది. ప్రజలకు నిత్యం అవసరం అయ్యే సర్టిఫికెట్లను, సేవలను మీ సేవ ద్వారా పొందే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.

గతంలో ఈ సేవలు ప్రైవేటు సైట్‌లో అందుబాటులో ఉండేవి. ఇందులో రెవెన్యూ, సంక్షేమ శాఖలకు సంబంధించిన సేవలు అందుబాటులోకి వచ్చాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి గ్యాప్ సర్టిఫికెట్, పౌరుని పేరు మార్పు, స్థానికత, మైనార్టీ, క్రిమిలేయర్, నాన్ క్రిమిలేయర్, సీనియర్ సిటిజన్, మెయింటెనెన్స్, మానిటరింగ్, వన్యప్రాణుల దాడిలో పరిహారం, సామిల్, టింబర్ డిపో తదితర వాటి కోసం మీసేవలో దరఖాస్తు చేసుకోవచ్చు. వీటితో పాటు హిందూ మ్యారేజ్ సర్టిఫికెట్, నాన్ అగ్రికల్చరల్ మార్కెట్ విలువ ధ్రువీకరణపత్రం, పాన్‌కార్డు సవరణ, ఇసుక బుకింగ్ సేవలు కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు.

● ఆధార్‌తో కుల ధ్రువీకరణ

కుల ధ్రువీకరణ పత్రం కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగనక్కరలేదు. మీసేవ కేంద్రంలో ఆధార్ నంబర్ చెపితే చాలు మీ కుల ధ్రువీకరణ పత్రం రెండు నిమిషాల్లో ఇస్తారు. కుల ధ్రువీకరణ పత్రాన్ని పొందడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. గతంలో కుల ధ్రువీకరణ పత్రం తీసుకుని ఉంటే మళ్లీ అవసరం ఉన్నప్పుడు తీసుకోవడానికి మాటిమాటికీ దరఖాస్తు చేసుకోవాల్సిన పనిలేదు. కులం మారదు కనుక అవసరం ఉన్న వారు నేరుగా మీసేవ కేంద్రాలకు వెళ్లి 45 రూపాయల రుసుము చెల్లించి ఆధార్ నెంబర్ ద్వారా తీసుకోవచ్చు. ఎస్సీ హిందూ సామాజిక వర్గానికి చెందిన వారికి ఈ విధానం వర్తించదు.

రోడ్డును ఆక్రమించి నిర్మించిన గోడ కూల్చివేత

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



గోడ కూల్చివేస్తున్న అధికారులు

ముత్తారం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఖైదంబండ గ్రామంలో రహదారిని కబ్జా చేశాడని ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితం కాగా స్పందించిన అధికారులు గోడను కూల్చివేశారు. గ్రామానికి చెందిన పుట్ట ఎర్ర ఓదెలు ఇంటిముందు సిమెంట్ రోడ్డు పై ప్రహరీ నిర్మించాడు. గ్రామ ప్రజలు ఇబ్బందులు అవుతున్నాయని, గోడను తొలగించాలని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చిన వార్తకు స్పందించిన ఎంపీడీవో సురేష్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి ట్రాక్టర్‌తో గోడను కూల్చివేశారు.

ఏఐఎస్‌బీలో విద్యార్థుల చేరిక

కోల్‌సిటీటౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి బ్లాక్‌లో గురువారం గోదావరిఖనికి చెందిన ఈర్ల రాంచందర్‌తో పాటు విద్యార్థులు చేరారు. పెద్దపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఏఐఎస్‌బీ రాష్ట్ర నాయకులు అతికం రాజశేఖర్ నేతృత్వంలో రాంచందర్‌తో పాటు సుమారు 50 మంది విద్యార్థులు రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్ సమక్షంలో చేరగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

మంత్రి ఆదేశాలతో చేతిబోరు మంజూరు

ముత్తారం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సీతంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని హనుమాన్ ఆలయం వద్ద మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు గురువారం బోరు వేశారు. ఆలయం వద్ద హనుమాన్ భక్తులు, బ్రహ్మంగారి భక్తులు దీక్ష తీసుకుంటారు. వారికి అక్కడ నీటి వసతిలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన చేతిబోరు వేయించారు. మాజీ సర్పంచ్‌లు పులిపాక నగేష్, లింగం రామయ్య, గంగుల రాజలింగు, రాజమల్లు, గ్రామశాఖ అధ్యక్షుడు పర్వతాలు, పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

కళ్యాణ్‌నగర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్ ఆత్మీయ సమ్మేళనం ఈనెల 2న పెద్దపల్లి ఎంబీ గార్డెన్‌లో నిర్వహించనున్నట్టు మాల సంఘం జిల్లా అధ్యక్షుడు బద్దం డానియల్, ఐఎన్‌టీయూసీ జిల్లా సెక్రటరీ రాచకొండ కోటేశ్వర్లు చెప్పారు. గురువారం ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మంత్రి వివేక్‌కు పార్టీలకు అతీతంగా స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంత్రిని కోరనున్నట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో మాల సంఘం నాయకులు సోగాల వెంకటి, మర్రి ఐలయ్య, కుమార్, చందర్, నర్సింగ్ దొర, లక్ష్మణ్‌రావు, పిట్టల వెంకయ్య, పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఆగస్టు 2న మంత్రి వివేక్ పర్యటన ఉన్నందున తెలంగాణ ఉద్యమకారులంతా తరలిరావాలని ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య కోరారు. కొలనూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంత్రి వివేక్‌కు ఫోరం ఆధ్వర్యంలో వినతిపత్రం అందిస్తామన్నారు. నాయకులు కందుల సదాశివ, కరక మోహన్ రెడ్డి, కందుల అశోక్,అమ్ముల మల్లయ్య, పెండెం చేరాలు,మాటూరి రాజు, తొట్ల కొమరయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు డ్రైవర్లకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు

కోల్‌సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని స్కూల్ బస్సుల డ్రైవర్లకు గురువారం రామగుండం ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఉదయమే వివిధ ప్రాంతాల్లో బస్సులను ఆపి పరీక్షలు జరిపారు. కొందరు స్కూల్ బస్సుల డ్రైవర్లు మద్యం సేవించి విధుల్లోకి వస్తున్నారనే సమాచారంతో పరీక్షలు జరిపామన్నారు. పిల్లల జీవితాలు డ్రైవర్ల చేతుల్లో ఉంటాయన్నారు. ప్రమాదాలు జరుగకూడదనే ముందస్తు చర్యల్లో భాగంగా తనిఖీలు జరిపినట్టు ఎస్‌ఐ హరిశేఖర్ పేర్కొన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రైవేటు స్కూల్ బస్సుల డాక్యుమెంట్స్‌ను పోలీసులు తనిఖీ చేశారు. ప్రైవేటు పాఠశాలల బస్సులు నడుపుతున్న డ్రైవర్ల లైసెన్సును పరిశీలించిన అనంతరం డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ డ్రైవర్లకు సూచనలు చేశారు. ప్రతీ డ్రైవర్ విధిగా లైసెన్స్ కలిగి ఉండాలని, రోడ్డుపై ఉండే టాఫిక్ సూచికలను పాటిస్తూ, నిబంధనలకు అనుగుణంగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించిన కఠిన చర్యలు ఉంటాయని ఎస్‌ఐ హెచ్చరించారు.



స్కూల్ బస్ డ్రైవర్లకు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న పోలీసులు, పొత్కపల్లిలో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

ఓదెల, (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంస్థల బస్సులు నడిపిస్తే డ్రైవర్లపై కఠినచర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ దీకొండ రమేష్ తెలిపారు. పొత్కపల్లిలో ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బస్సులను తనిఖీ చేశారు. వాహన డాక్యుమెంట్, డ్రైవర్లు పాటించవలసిన నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ, వాహనాలు కండిషన్‌లో ఉండాలని, ఫిట్నెస్, ఇన్సూరెన్స్ పర్మిట్లు, డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్ ఫైర్ సేఫ్టీ కిట్, ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలని కోరారు. డ్రైవర్లు యూని ఫామ్ ధరించాలన్నారు. పరిమితికి మించి విద్యార్థులను తరలించవద్దని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని కోరారు.

రామగుండంలో సర్వీస్ రోడ్లకు మోక్షం

(5వ పేజీ తరువాయి)

ప్రారంభించారు. గోదావరిఖని బస్టాండ్ వద్ద వాణిజ్య భవనంతోపాటు ఇతర నిర్మాణాలను తొలగించారు. వారికి ప్రత్యామ్నాయ స్థలాలను ఇచ్చారు. గోదావరిఖని గంగానగర్‌లో విస్తరణ చేపట్టారు. కవితా థియేటర్ డౌన్‌లో లయన్స్‌క్లబ్ భవనం నుంచి ఇల్లందు క్లబ్ కార్నర్ వరకు నిర్మాణం మొదలుపెట్టారు. ఈ రహదారిలోని ప్రైవేట్ భవనాలను యజమానులే స్వచ్ఛందంగా తొలగించుకుంటున్నారు. ప్రశాంత్‌నగర్ నుంచి శ్రీనగర్‌కాలనీ రహదారి వరకు రోడ్డు నిర్మాణం జరిపేందుకు చేపడుతున్నారు. ఎన్‌టీపీసీ హెలీ ప్యాడ్ రోడ్డు నుంచి టీటీఎస్ గేట్ వరకు కూడా నిర్మాణం జరిపేందుకు కసరత్తు చేస్తున్నారు. రాజీవ్ రహదారి నిర్మాణ సంస్థ హెచ్‌కేఆర్ ఆధ్వర్యంలో ఈ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు

ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



రాజీవ్ రహదారి నిర్మాణ సమయంలోనే సర్వీస్ రోడ్డు, ఫ్లై ఓవర్ల నిర్మాణం జరుగాల్సి ఉంది. అక్కడక్కడ నిర్మించినా అవి ఉపయోగపడడం లేదు. గత పాల కులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఎంతో మంది ప్రమా దాల్లో మరణించారు. హెచ్‌కేఆర్ సంస్థ ఆర్థికంగా నష్టాల్లో ఉందని చేతులెత్తేసినా వెంట పడి పనులు చేయిస్తున్నాం. కొందరు వ్యాపారులకు ఇబ్బందులు ఎదురవుతున్నా సహకరిస్తున్నారు. భవిష్యత్‌లో పరిశ్రమలు ఉన్న స్థలాల్లో విస్తరణ చేపడుతాం.

ధ్యానంతో మానసిక, శారీరక ఆరోగ్యం

కోల్‌సిటీటౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ధ్యానంతో మానసిక, శారీరక ఆరోగ్యం కలుగుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంజీవ్ అన్నారు. గురువారం గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ఆధ్వర్యంలో హర్ట్ ఫుల్‌నెస్ సహకారంతో మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ట్రైనర్స్ ఆనంద్, మహర్షి, నరసింహారెడ్డి ధ్యానం అవశ్యకతను తెలిపారు. మొదటి రోజు శ్వాసమీద ధ్యాస అనే అంశంపై అవగాహన కల్పించారు. మానసిక ఒత్తిడి ఎక్కువైతే శరీరంలో ఏ భాగాలపై ఒత్తిడి పడుతుందో తెలియజేస్తూ దానిని జయించడానికి మార్గాలను తెలిపారు. అధ్యాపకులు జీడీ కనకయ్య, శ్రీనివాస్, లైబ్రేరియన్ శంకరయ్య, దేవిదాస్, శాంతా రామారావు, సతీష్, పాల్గొన్నారు.

శేష జీవితం సంతోషంగా గడపాలి



పదవీ విరమణ ఉద్యోగులను సన్మానిస్తున్న కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందిన ఉద్యోగులు కుటుంబంతో సంతోషంగా ఉండాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జె అరుణశ్రీ అన్నారు. పబ్లిక్ హెల్త్ వర్కర్స్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన ఆవునూరి మల్లయ్య, కుమ్మరి రాయపోషమ్మ, రేణికుంట్ల పోచయ్యను గురువారం సన్మానించారు. ఆమె మాట్లాడుతూ పదవీ విరమణ తరువాత ఆర్థిక ఇబ్బందులు పడకుండా ఈఎల్ ప్రయోజనం ప్రొసీడింగ్‌లను అందించామని, పదవీవిరమణ పొందిన వారికి అదే రోజు గ్రాట్యూటీతో పాటు ఇతర ఆర్థిక ప్రయోజనాలు అందిస్తామన్నారు. అనంతరం పదవీవిరమణ పొందిన ముగ్గురిని కార్యాలయం నుంచి ఇంటికి కార్లలో పంపించారు. కార్పొరేషన్ ఈఈ రామన్, ఏసీపీ శ్రీహరి, డీఈ ఆంజనేయులు, ఏఈ మీర్, ఆర్‌ఓ ఆంజనేయులు, అకౌంట్ ఆఫీసర్ రాజు, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, ఆర్‌ఐ శంకర్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం పాల్గొన్నారు.

పోలీసు అధికారుల పదవీ విరమణ

కోల్‌సిటీ, జూలై 31(ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్ అడిషనల్ డీసీపీ (అడ్మిన్) సీ రాజు గురువారం పదవీవిరమణ పొందారు. ఆయనతో పాటు ఇన్‌స్పెక్టర్ నరేష్‌బాబు, ఆర్‌ఎస్‌ఐ సమ్మయ్య పదవీవిరమణ పొందారు. కమిషనరేట్‌లో జరిగిన కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్ ముగ్గురు అధికారులను సన్మానించారు. డీసీపీ భాస్కర్ మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థ అత్యంత క్లిష్టంగా ఉన్న పరిస్థితుల్లో విధులు నిర్వర్తించి సంఘ విద్రోహ శక్తులతో పోరాడన్నారు. సుదీర్ఘకాలంపాటు సేవలందించి పదవీవిరమణ పొందుతున్నందుకు శుభాకాంక్షలు తెలిపారు. 13 బెటాలియన్ కమాండెంట్ మూర్తి, ఎస్‌బీ ఏసీపీ మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏఓ శ్రీనివాస్, ఆర్‌ఐలు దామోదర్, మల్లేషం, శ్రీనివాస్, వామనమూర్తి, సూపరింటెండెంట్లు ఇంద్రసేనారెడ్డి, సంధ్య, మనోజ్‌కుమార్, సీసీ హరీష్, అధికారుల సంఘం అధ్యక్షుడు పోచలింగం పాల్గొన్నారు.



పోలీస్ అధికారులను సన్మానిస్తున్న డీసీపీ భాస్కర్

బదిలీ అయిన ఏపీఎంలకు సన్మానం

పెద్దపల్లి రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండల ఏపీఎంగా పదేళ్ల విధులు నిర్వహించి బదిలీ అయిన సంపత్‌ను కార్యాలయ సిబ్బంది సన్మానించారు. ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్ సంపత్‌ను శాలువాతో సన్మానించారు. ఎంపీవో ఫయాజ్, టాస్క్ ఇంచార్జి కౌసల్య పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలానికి బదిలీపై వెలుతున్న ఏపీఎం లతా మంగేశ్వరిని స్వశక్తి మహిళ సంఘాలు, సీసీలు సన్మానించారు. డీజీబి మేనేజర్ సురేంద్ర, సీసీలు, స్త్రీ నిధి మేనేజర్ ప్రభాకర్, పవన్, భవాని, రమేష్, అలాగే ఆలేటి స్వప్న, పాల్గొన్నారు.

ఏఎంసీ పాలకవర్గానికి సన్మానం

మంథని, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, డైరెక్టర్లు రావికంటి వెంకటేష్, కన్నెబోయిన ఓదెలు, ఎండీ అంకూస్‌లను సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ గురువారం శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. సింగిల్‌విండో డైరెక్టర్లు కొత్త శ్రీనివాస్, కిషన్‌రెడ్డి, సీఈవో మామిడాల అశోక్, నాయకులు ఊదరి శంకర్, పెంటరి రాజు, ఆరెల్లి కిరణ్‌గౌడ్, సాదుల శ్రీకాంత్, దొరగొర్ల శ్రీనివాస్, మంథని శ్రీనివాస్, పర్శవేన మోహన్, ఆరెల్లి వరుణ్‌లు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ధర్మారం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సి.జగన్‌మోహన్ రెడ్డి సూచించారు. గురువారం చామనపల్లి, పత్తిపాక గ్రామాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటి వాటి సాగు, సంరక్షణ, పంట దిగుబడి, ఆదాయ వనరులపై వివరించారు. ఆయిల్ పామ్ మొక్కలు నాటిన తోటల్లో అంతర్ పంటలుగా బొప్పాయి, మునగ, అల్లం పెప్పర్ వంటి పంటలు పండించి రైతులు లాభాలు పొందవచ్చునని తెలిపారు. ఎకరాకు సంవత్సరానికి 4200 రూపాయల సబ్సిడి వస్తుందని, ప్రభుత్వం జిల్లాకు 2500 ఎకరాలు లక్ష్యంగా ఇచ్చిందని, పంటలు పండించుటకు రైతులు ముందుకు రావాలని సూచించారు. తిరుమల ఆయిల్ కెమ్ ఇండియా ప్రైవేట్ కంపెనీ సీఈఓ కేశు కళ్యాణ్‌కర్, ఫీల్డ్ ఆఫీసర్ మహేష్ రైతులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ఉండాలి

మంథని, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కు పై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్గి ఉండాలని కాకతీయ హైస్కూల్ ప్రిన్సిపాల్ ప్రదీప్‌రెడ్డి సూచించారు. కాకతీయ ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ ప్రదీప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహణపై గురువారం అవగాహన కల్పించి ఎన్నికలు నిర్వహించారు. పాఠశాల హెడ్ బాయ్, హెడ్ గర్ల్, స్పోర్ట్స్ సెక్రటరీ పోస్టులను ఎన్నుకున్నారు. న్యాయవాది కేతిరెడ్డి రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య స్ఫూర్తిని భావితరాలకు అందించడం హర్షనీయమని, ఓటు హక్కుల వినియోగం గొప్పతనాన్ని వివరించారు. హెడ్ బాయ్‌గా సాయిరాంరెడ్డి, హెడ్ గర్ల్‌గా ధనశ్రీ, స్పోర్ట్స్ సెక్రటరీగా వరుణ్, డిసిప్లేయిన్‌కమిటీ మెంబర్‌గా శ్రీనిధిలను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రవికిరణ్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, పావని, స్రవంతి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞాన విషయాలు తెలుసుకునేందుకే మొబైల్ వాడాలి

కమాన్‌పూర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మొబైల్ ఫోన్‌లను విద్య, విజ్ఞాన విషయాలకు మాత్రమే ఉపయోగించాలని ఆపిల్ కిడ్స్ పాఠశాల కరస్పాండెంట్ చదువు వెంకట్ రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఆపిల్ కిడ్స్ పాఠశాలలో సెల్ ఫోన్ అవేర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆయన మాట్లాడుతూ విద్యా ర్థులు మొబైల్ ఫోన్‌ను ఎక్కువగా వాడితే జ్ఞాపిక శక్తితో పాటు, కంటి చూపు దెబ్బతినే ప్రమాదం ఉంటుందన్నారు. కలిగే నష్టాలను విద్యార్థులకు తెలియజెప్పాలనే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రిన్సిపాల్ రాజమణి, భూలక్ష్మి, గౌతమి, జేబా, ప్రియాంక, నాగరాణి, గీత, రాణి తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ కార్యక్రమాలపై జీఎం సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం జీఎం

రామగిరి, జూలై 31(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఏపిఏ డివిజన్‌లో సంక్షేమ కార్యక్రమాలపై ఏపిఏ జీఎం నాగేశ్వర్‌రావు సంక్షేమాధికారులు, పర్సనల్ అధికారులతో గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ దరఖాస్తులు స్వీకరించిన వెంటనే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా టర్మినల్ బెనిఫిట్స్ చెల్లింపులు, కారుణ్య నియామక ఉద్యోగాల కల్పనలో జాప్యం కాకుండా చూడాలన్నారు. విశ్రాంత ఉద్యోగులకు అమలు చేస్తున్న వైద్య సేవల పథకానికి సంబంధించి విశ్రాంత ఉద్యోగులకు అవగాహన కల్పించి వారి నుంచి దరఖాస్తులు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్రమశిక్షణ చర్యలు, గైర్హాజరు ఉద్యోగుల వివరాలను అధికారులు అందించారు. అధికారులు సుదర్శనం, సునీల్‌ప్రసాద్, రాజేశం, రవిచంద్ర, మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్లలో వర్గీకరణ అమలు చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 31(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో చేపట్టే ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో ఎస్సీ వర్గీకరణ కింద మాదిగలకు అవకాశం కల్పించాలని సింగరేణి మాదిగ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ బృందం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కోరారు. గురువారం మంత్రిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలుకు ముందుకు రావడం శుభపరిణామమని తెలిపారు. జనరల్ సెక్రెటరీ సొప్పదండి దుర్గాప్రసాద్, ప్రెసిడెంట్ బొంకూరి మోహన్ ఉన్నారు.

సింగరేణి రక్షణ కోసం బీఎంఎస్ ఉద్యమం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎంఎస్ నాయకులు

రామగిరి, జూలై 31(ఆంధ్రజ్యోతి): సింగరేణి రక్షణ కోసం బీఎంఎస్ ఉద్యమిస్తోందని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. గురువారం సెంటినరీకాలనీలోని కార్యాలయంలో నిర్వహించి పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణి రక్షణ కోసం బీఎంఎస్ ప్రతిపాదిత ఉద్యమ కార్యాచరణకు చేపట్టిందన్నారు. అందులో భాగంగా నాలుగు దశల్లో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఉద్యమ కార్యాచరణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. బీఎంఎస్ నాయకులు పిన్నమనేని వేణుగోపాల్‌రావు, అరుకాల ప్రసాద్, రౌతు రమేష్, విద్యాసాగర్, కృష్ణ సంతోష్, జానీ, భీమరి మహేష్, సంతోష్, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులు మెడికల్ రెన్యూవల్ చేసుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 31(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు వైద్య సేవలు పొందేందుకు ఏర్పాటు చేసిన సీపీఆర్‌ఎస్‌ఎంఎస్ మెడికల్ రెనూవల్ చేసుకోవాలని ఆర్జీ-2 అధికార ప్రతినిధి, డీజీఎం పర్సనల్ అరవిందరావు ప్రకటనలో పేర్కొన్నారు. కాంట్రిబ్యూటరీ పోస్టు రిటైర్మెంట్ మెడికేర్ స్కీం కింద వైద్య సహాయం పొందాలంటే సకాలంలో ఆన్‌లైన్ ద్వారా లైవ్ సర్టిఫికేట్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆర్జీ-2 ఏరియాలో 3381 మెడికల్ కార్డులు ఉన్నాయని, ఇందులో 2559 మంది ఉద్యోగులు మాత్రమే ఆన్‌లైన్ ద్వారా లైవ్ సర్టిఫికేట్లు నమోదు చేసుకున్నట్టు తెలిపారు. మిగిలిన వారిలో 492 మంది ఉద్యోగులు ఒక్కరు మాత్రమే నమోదు చేసుకున్నట్టు పేర్కొన్నారు. మెడికల్ కార్డుపై వైద్య సహాయం పొందాలంటే భార్య, భర్తలు ఇద్దరు లైవ్ సర్టిఫికేట్లతో నమోదు చేసుకోవాలని సూచించారు. మిగిలిన 330 మంది కార్డు దారులు ఇప్పటి వరకు ఎటువంటి సమాచారం లేకుండా ఉన్నట్టు తెలిపారు. సింగరేణి సంస్థ అందిస్తున్న వైద్య సహాయం పొందాలంటే సకాలంలో లైవ్ సర్టిఫికేట్‌నే మీసేవా లేదా ఈసేవా సెంటర్‌లలో మరియు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని అరవిందరావు పేర్కొన్నారు.

క్వార్టర్ల మరమ్మతు వెంటనే చేయించాలి

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 31(ఆంధ్రజ్యోతి): కాలనీ, పోతనకాలనీలలో క్వార్టర్లు దెబ్బతిన్నాయని, వాటిని వెంటనే మరమ్మతు చేయించాలని ఆర్‌జీ-2 జీఎం కోరారు. గురువారం సీఐటీయూ నాయకులు జీఎంకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి మాట్లాడుతూ బస్తీబాటలో కార్మిక కుటుంబాలు క్వార్టర్స్ విషయంలో అనేక సమస్యలు దృష్టికి తీసుకువచ్చారని, క్వార్టర్స్ దెబ్బతిన్నాయని, ఇంటిపై కప్పు పెచ్చులు ఊడి పడుతున్నాయని తెలిపారు. కార్మికులు ఇంటిపై కప్పు పరిసరాలు, నీటి సౌకర్యాలు గురించి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే కార్మిక కుటుంబాల సమస్యలను పరిష్కరించాలని కోరారు. బ్రాంచి కార్యదర్శి కుంట ప్రవీణ్‌కుమార్, సోమవారపు వెంకన్న, అట్ల సంపత్, రాంసాగర్, రాంప్రసాద్, సారంగం, సాంబారావు, సంపత్, ఆర్‌జీ-3 అధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.



జీఎంకు వినతిపత్రం అందజేసిన సీఐటీయూ నాయకులు

వరి సాగులో విత్తన శుద్ధి పాటించాలి



నర్సాపూర్‌లో రైతులతో శాస్త్రవేత్త సతీష్ చంద్ర

ఎలిగేడు, జూలై 31(ఆంధ్రజ్యోతి): వరి సాగులో రైతులు విత్తన శుద్ధి పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని కూనారం వ్యవసాయ పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త సతీష్ చంద్ర అన్నారు. గురువారం నర్సాపూర్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. వరి పంటలో ఎరువులు, కలుపు యాజమాన్యం, దొడ్డు, సన్నరకాలు తదితర అంశాలు, పంట కాలంపై వివరించారు. లేత నారు 21 రోజుల్లో నాట్లు వేసుకోవాలని, నారుమడిలో 3 కేజీల గుళికలు ఒక కిలో చొప్పున వాడుకుంటే కాండం తొలుచు, ఆకుచుట్టు పురుగులు రాకుండా చేయవచ్చన్నారు. ప్రధాన పొలంలో కాలిబాట తీసుకోవాలని, సమగ్ర చీడపీడలు, వాటికి వాడాల్సిన పురుగు మందులపై వివరించారు. పీఏసీఎస్ చైర్మన్ గోపు విజయ భాస్కర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఉమాపతి, విస్తరణ అధికారి గణేష్ పాల్గొన్నారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరానికి హైదరాబాద్‌లోని బేగంపేట, రామంతాపూర్ పబ్లిక్ పాఠశాలల్లో 1వ తరగతి ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశాలకు అర్హులైన ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తు కోరుతున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. జిల్లాకు రెండు సీట్లు కేటాయించారని, 2018 జూన్ 1 నుంచి 2019 మే 31 మధ్యలో జన్మించిన వారు అర్హులన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం అర్బన్ ప్రాంతంలో రూ.2 లక్షలు, రూరల్ రూ.1.50 లక్షల లోపు ఉండాలని తెలిపారు. కుల, ఆదాయ, స్టడీ సర్టిఫికెట్, పాస్ పోర్టు సైజ్ ఫొటోలు 2 జత చేసి ఈ నెల 8లోగా కలెక్టరేట్‌లోని జిల్లా ఎస్సీ అభివృద్ధి కార్యాలయంలో సమర్పించాలన్నారు. వీరిని 10న లాటరీ ద్వారా ఎంపిక చేస్తారని, వివరాలకు కలెక్టరేట్‌లోని ఎస్సీ అభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

కల్వర్టు మరమ్మతు పూర్తి.. రైతుల హర్షం...

కాల్వశ్రీరాంపూర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల నుంచి పోచంపల్లికి వెళ్లే దారిలో నక్కలవాగుపై కల్వర్టును ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మరమ్మతు చేయించారు. ఇటీవల కురిసిన వర్షాలకు నక్కల వాగు పొంగడంతో కొందరు కూలీలు నీటిలో చిక్కుకుపోయారు. పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేటకు చెందిన మహిళలను తాడు సాయంతో రక్షించారు. ఈ విషయమై మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాజనవేన సదయ్యలు పరిస్థితిని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ రోడ్డు గుండా రెండు గ్రామాల ప్రజలు పలు వాహనదారులు, బాటసారులు ప్రయాణిస్తుంటారు. వర్షం పడితే వాగు పొంగి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రైతులు పొలాలకు వెళ్లేందుకు ప్రమాదకరంగా మారుతున్నది. స్పందించిన ఎమ్మెల్యే పైపులు వేయించి, రహదారిని బాగు చేయించారు. రెండు గ్రామాల రైతులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

కమాన్‌పూర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తాచాటాలని పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ అన్వర్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనపై నమ్మకంతో మండల అధ్యక్ష పదవి అప్పగించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సహకరించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు, జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్, మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. సింగిల్ విం డో చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు, ఏఎంసీ డైరెక్టర్ గట్టయ్య, అబ్దుల్ రఫీక్, గుమ్మడి వెంకన్న, సత్యనారాయణ గౌడ్, పాల్గొన్నారు.

సెర్ప్ ఆధ్వర్యంలో స్వీట్ హౌస్ ప్రారంభం

ఎలిగేడు, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మంజునాథ గ్రామైక్య సంఘం పరిధిలోని మణికంఠ ఎస్‌హెచ్‌జి కోడూరి రమ శ్రీనివాస్ దంపతులకు బ్యాంకు లింకేజీ రుణం లక్ష అందించారు. గురువారం జీవనోపాదుల ద్వారా వారు స్వీట్ హౌస్‌ను ప్రారంభించారు. ఎంపీడీవో భాస్కర్‌రావు, తహసీల్దార్ యాకయ్య, ఎస్‌బీఐ మేనేజర్ అమర్‌నాయక్, ఐకేపీ ఏపీఎం పోగుల సుధాకర్, సీసీ ఆనంద్, వీఓఏలు కౌసల్య, రాజేశ్వరి, మమత, స్వశక్తి మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్రపతి భవన్‌ను సందర్శించిన విద్యార్థులు



రాష్ట్రపతి భవన్ వద్ద విద్యార్థులు

పెద్దపల్లి కల్చరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్‌కు చెందిన విద్యార్థులు గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్రపతి భవన్‌ను సందర్శించారు. విద్యార్థులు రాష్ట్రపతి భవన్ చరిత్ర, నిర్మాణ శైలి తెలుసుకున్నారు. గైడ్‌లు ప్రాంగణంలోని ప్రధాన హాళ్లు, సమావేశ మందిరాలు, రాష్ట్రపతి అధికారిక కార్యక్రమాలు, ప్రదేశాలపై అవగాహన కల్పించారు. గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, దీపిక, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

ఎలిగేడు, జూలై 31(ఆంధ్రజ్యోతి): సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన అనగోని సుమన్ ఇటీవల అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకున్నాడు. వారి కుటుంబాన్ని గురువారం ప్రగతి స్కూల్ కరస్పాండెంట్ గర్రెపల్లి సురేందర్, ప్రిన్సిపాల్ కావ్య, వైస్ ప్రిన్సిపాల్ ఉపేందర్, ఇన్‌చార్జి గోపి పరామర్శించారు. మృతుడి భార్య మమతకు రూ.1116, యాభై కేజీల బియ్యాన్ని అందించారు. వారి కుమారులు పార్థు, శివలకు పదో తరగతి వరకు ఉచిత విద్య అందిస్తామని హామీఇచ్చారు.

కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

కళ్యాణ్‌నగర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను తొలగించడం వల్ల వారి కుటుంబాలు రోడ్డున పడుతాయని, మానవతా దృక్పథంతో వారిని విధుల్లోకి తీసుకోవాలని కలెక్టర్‌ను ఏఐటీయూసీ జిల్లా సెక్రటరీ కడారి సునీల్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అనేక మంది పేదలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పని చేస్తున్నారని, వారికి చాలీచాలని వేతనాలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారని, తొలగించిన కాంట్రాక్టు కార్మికులపై జాలి చూపి తిరిగి ఉద్యోగాలు ఇప్పించాలని కోరారు.

మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యవర్గం

మంథని, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మంథని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడిగా గడిపెల్లి మల్లేష్ ఎన్నికయ్యారు. గురువారం సీఐటీయూ అనుబంధ సంఘమైన వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా చందు, గౌరవ అధ్యక్షులుగా బూడిద గణేష్, చింతల గోవింద్, సలహాదారులుగా వడ్లకొండ దేవేందర్, ఇగురాల వేణులను ఎన్నుకున్నారు.

సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిద్దాం

పెద్దపల్లిటౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): క్యూబాను ఆర్థిక దిగ్బంధనంలోకి నెట్టిన అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, క్యూబాకు సంఘీభావంగా ఆగస్టు 1 నుంచి 10 వరకు జరిగే సంఘీభావ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. ఉద్యోగ, కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎన్. బిక్షపతి, ఎం. రామాచారి, జి. జ్యోతి, సిపెల్లి రవీందర్, సిహెచ్. అరవింద్, నాగమణి, వెంకటస్వామి పాల్గొన్నారు.